తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
12 ఆగస్టు 2026

## హెచ్‌ఐవీ పరీక్షలకు డిజిటల్ విధానం

- క్యూఆర్ కోడ్‌తో సులభంగా సేవలు పోస్టర్ విడుదల చేసిన ౧ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి):** కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో క్యూ ఆర్ కోడ్ సేవల పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ...హెచ్‌ఐవీ (ఎయిడ్స్)పై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, అవసరమైన వారికి పరీక్షలు మరియు సేవలను మరింత సులభంగా అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి వస్తుందన్నారు. మిగతా 9లో..

## లక్ష మందితో సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**సంగారెడ్డి ఆగస్టు 11 (జనంసాక్షి):** ఈ నెల 15న సంగారెడ్డిలో సీఎం బహిరంగ సభ ఏర్పాట్లపై సెక్రటేరియట్‌లో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్ష సమావేశం సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 15న సంగారెడ్డిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లపై సచివాలయంలోని తన ఛాంబర్‌లో నీటిపారుదల, పౌర సరఫరా శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, మంత్రి దామోదర రాజనర్సింహ వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండటం వల్ల ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు.

ఈ సందర్భంగా సభకు భారీ జన సమీకరణ, వేదిక ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి సంగారెడ్డికి చేరుకుంటారని, సాయంత్రం 4 గంటల వరకు సంగారెడ్డిలో ఉంటారని నేతలు వెల్లడించారు. సీఎం సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని, జన సమీకరణ, భద్రత, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్, జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుండి నియోజకవర్గానికి ఒకరు చొప్పున, మొత్తం పది మంది లబ్ధిదారులకు సీఎం రేవంత్ రెడ్డి సభా వేదికపైనే స్వయంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారని మంత్రి తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సూచించారు. సుమారు లక్ష మంది జనంతో ఈ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం కేటాయించాలి: కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 11(జనంసాక్షి):** దామరగిద్ద మండల కేంద్రం లోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం పరిశీలించారు. మండల మహిళా సమా ఖ్య కార్యాలయం పక్కన ఉన్న భవనంలో 2019 సంవత్సరం నుంచి సీజన్ వారీగా మహిళా సమాఖ్య సభ్యులు సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నట్లు డీపీఎం జయన్న కలెక్టర్‌కు వివరిం చారు. యూనిట్ ద్వారా వచ్చిన లాభాలు, మహిళ లకు కల్పించిన ఉపాధి అవకాశాలతో పాటు యూనిట్‌లో తయారు చేసిన సీతాఫలం గుజ్జును విదేశాలకు సైతం ఎగుమతి చేసినట్లు తెలిపారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ప్రస్తుత సీజన్‌లో కూడా సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న భవనంలో సీతాఫలాలను నిల్వ చేసేందుకు,అవసరమైన ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసేందుకు స్థలం సరిపోవడం లేదని మహిళా సమాఖ్య సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకువ చ్చారు. యూనిట్ నిర్వహణకు అనువుగా పెద్ద గోదాం నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు.

దీనిపై తహసీల్దార్ తిరుపతయ్య మాట్లాడుతూ మండలంలోని కంసాన్‌పల్లి గ్రామం లో ప్రభుత్వ భూమిని గుర్తించి నట్లు కలెక్టర్‌కు తెలిపారు. వీలైనంత త్వరగా ఆ స్థలాన్ని సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు.

అదేవిధంగా వేరుశనగ నూనె ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా అనువైన స్థలాన్ని కేటాయించాలని సూచించారు. స్థలం కేటాయించే వరకు ప్రస్తుత సీజన్‌లో ఉన్న భవనంలోనే సీతా ఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను కొనసాగించాలని మహిళా సమాఖ్య సభ్యులకు కలెక్టర్ సూచించారు.

మిగతా 10లో..



## దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి

- సార్వత్రిక విద్యతో ఉన్నత చదువులకు అవకాశం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 11(జనంసాక్షి);** చదువును మధ్యలో ఆపేసిన వారికి తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య విధానం ద్వారా తిరిగి చదువుకునే అవకాశాన్ని కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్ఎస్ సి, ఇంటర్ లో ప్రవేశాల గోడపత్రికలను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి విడుదల చేశారు. మిగతా 9లో..

## ప్రతి కేసులో వేగవంతమైన దర్యాప్తు పూర్తి చేయాలి: జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 11(జనంసాక్షి):** ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును వేగంగా పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, అదృశ్యమైన వారి కేసులు, న్యాయస్థాన వారెంట్ల అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, మహిళల భద్రత, గ్రామ స్థాయి సమాచార సేకరణ, నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అలా గే పోలీస్ స్టేషన్ల స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు, సిబ్బందికి రివార్డులు, ప్రశంసాపత్రాల కోసం సిఫారసు చేయాలని ఎస్‌హెచ్ ఓలకు సూచించారు. అనంతరం అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఎస్‌హెచ్‌ఓలకు కేటాయించిన పోలీసు వాహనాల స్థితిగతులను పరిశీలించారు. సమీక్షా సమావేశంలో డీఎస్పీలు సత్యయ్య గౌడ్, వెంకట్ రెడ్డి, సైదా నాయక్, ప్రభాకర్, సురేందర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, జిల్లా ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు సురేష్, రాజశేఖర్ రెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర



• కొమురవెల్లిలో ఘన స్వాగతం.. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సంఘీభావం

**కొమురవెల్లి, ఆగస్టు 11(జనంసాక్షి):** అమరుల యాదిలో గీత కార్మికుల సమస్యల పరిష్కారం, గౌడుల హక్కుల సాధన కోసం కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మేకపోతుల రమణగౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన గీతన్నల చైతన్య బస్సు యాత్ర సోమవారం కొమురవెల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొమురవెల్లి మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజు గౌడ్ ఆధ్వర్యంలో గీతన్నలు, గౌడ సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు. కొమురవెల్లి పట్టణంలో గీతన్నల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి అమరులైన గౌడ వీరులను స్మరిస్తూ అనంతరం గౌడుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల రమణగౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం గౌడ సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రాష్ట్రంలోని గీత కార్మికులను, గౌడ సంఘాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గీత కార్మికుల సంక్షేమం కోసం సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బస్సు యాత్రకు బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి విరాసతోళ్ల శ్రీనివాస్‌గౌడ్ సంఘీభావం తెలిపారు. గీతన్నల హక్కుల సాధన కోసం చేపట్టిన చైతన్య యాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి వేలాదిమంది గౌడన్నలు తరలివచ్చారు. మల్లన్నను దర్శించుకున్న గీతన్నల నేతలు అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల రమణగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు బూడిద గోపి, వెంకటమలు తదితరులు కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించారు.

ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, సంఘం సభ్యులు, గౌడ సంఘాల నాయకులు, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కంగ్టిలో బైపాస్ రోడ్డు పనులు చేపట్టాలి




**కంగ్టి, ఆగస్టు11(జనంసాక్షి):** కంగ్టి మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి హెచ్. దాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం కావడంతో ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, దీంతో ట్రాఫిక్ రద్దీతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత రహదారి గుంతలమయంగా మారడంతో పాటు వర్షాకాలంలో నీరు నిలిచి పోతుండటంతో ప్రమాదాల ముప్పు ఉందన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఏళ్లుగా హామీలు ఇస్తున్నప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టి ప్రజల చిరకాల డిమాండ్‌ను నెరవేర్చాలని ఆయన కోరారు.

## బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్

# ఉదయ్ నాగరాజుకు అభినందనలు

• మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి సుధాకర్



**కోహెడ, ఆగస్టు 11(జనంసాక్షి):** మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన ఉదయ్ నాగరాజు లండన్‌లో ఇటీవల బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్‌గా నియమింపబడి ప్రమాణస్వీకారం చేసి మొట్ట మొదటిసారిగా తన స్వంత గ్రామానికి విచేసినటువంటి ఉదయ్ నాగరాజుకు కాంగ్రెస్ పార్టీ కోహెడ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మొట్ట మొదటిసారిగా ఒక తెలంగాణ రాష్టానికి చెందిన వ్యక్తి శాశ్వత రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై కోహెడ మండలాన్ని ప్రపంచ దేశాలు శనిగరం గ్రామం వైపు చూసేలా చేసిన గొప్ప వ్యక్తి అని ఆయన కొనియాడారు. అలాగే ఒకప్పుడు భారత దేశాన్ని పరిపాలించిన బ్రిటిష్ దేశానికే మీరు శాశ్వత రాజ్యసభ సభ్యులుగా ఎన్నిక కావడం అనేది హర్షించదగ్గ విషయమన్నారు. మన మండలం నుండి విద్యార్థులు కానీ ఉద్యోగ రీత్యా వచ్చిన వారికి ఏమైనా ఇబ్బందులు ఎదురైతే మన బిడ్డలుగా గుర్తించి వారికి సహాయ సహకారాలు అందించాలని సుధాకర్ కోరారు. అందుకు ఉదయ్ నాగరాజు సానుకూలంగా స్పందినట్లు తెలిపారు.

# బిజెపి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ



**మిడ్జిల్, ఆగస్టు 11(జనంసాక్షి):** మండల కేంద్రంలోని బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని జడ్చర్ల. కల్వకుర్తి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తూ అదేవిధంగా గ్రామంలోని ప్రధాన దారులలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రతి ఒక్కరు తమ తమ ఇండ్లపై జాతీయ జెండా ఎగురవేసి దేశ భక్తుని చాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ముచ్చర్లపల్లి జనార్దన్ రెడ్డి. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్.రాజేందర్ రెడ్డి. బీజేవైఎం నాయకులు తిరుపతి. నరేష్ నాయక్. వెంకట్ రెడ్డి. లాలు. వాసుదేవ్. ఆంజనేయులు. బ్రహ్మాచారి. వెంకట్. శ్రీనివాసులు. రాములు. నరేష్. చారి. నవీన్. చింటూ. ట్రాక్టర్ డ్రైవర్లు. కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగారం పాఠశాలలో విద్యార్థులకు బూట్ల పంపిణీ



**నారాయణపేట ఆగస్టు 11(జనంసాక్షి):** నారాయణపేట మండలం, సింగారం గ్రామం మంగళవారం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న బూట్లను సర్పంచ్ నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులందరికి బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఎంతో ఖర్చు చేసి సౌకర్యాలు కల్పిస్తున్నారని, దానికి తగ్గట్టుగా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతో పాటు బూట్లను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, బూట్లను ఎత్తు ప్రదేశాల్లో ఉంచుకోవాలని, లేకుంటే విష పురుగులు చేరే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఏపియస్ చెర్మెన్ సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జగ్గారెడ్డిపై విమర్శలు చేస్తే ఖబర్దార్

• అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? చింతాకు సవాల్
• అభివృద్ధి చెయ్యని ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై విమర్శలు చేయడం సరికాదు
• అక్రమాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే ఆధారాలతో చూపిస్తాం
• బహిరంగ చర్చకు సిద్ధమా
• ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు గాటుగా వార్నింగ్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలు



**సంగారెడ్డి, ఆగస్టు 11 (జనంసాక్షి):** సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. జగ్గారెడ్డిపై విమర్శలు చేస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. తాము చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు సవాల్ విసిరారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలో విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడుతూ...

2017లో సంగారెడ్డిలో రాహుల్ గాంధీ సభ విజయవంతం కావడంతో కేసీఆర్, హరీష్ రావులు జగ్గారెడ్డిపై కక్ష పెంచుకున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలకు చింతా ప్రభాకర్‌కు ఇచ్చిన కౌంటర్ పై కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతా ప్రభాకర్ కుటుంబానికి సంబంధించిన భూముల వ్యవహారంపై ప్రశ్నలు లేవనెత్తారు. సీలింగ్ భూమి రిజిస్ట్రేషన్, దళితుల భూములు, సదాశివపేటలో రోడ్ల కబ్జా, మాలకుంట కబ్జా తదితర అంశాలపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో మహిళా కౌన్సిలర్ల పట్ల వ్యవహరించిన తీరుపైనా ప్రశ్నించారు.

సదాశివపేటలో ఎక్కడికి రమ్మన్నా మేము అక్కడికి వస్తాం.. బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ఇకపై బీఆర్ఎస్ నాయకుల అవినీతి చిట్టాను ఒక్కొక్కటిగా బయటపెడతామని హెచ్చరించారు.

సంగారెడ్డి అభివృద్ధిపై సైతం చింతా ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. ఐఐటీ, ఇంటింటికీ మంజీరా నీరు, సంగారెడ్డి–లింగంపల్లి నాలుగు లేన్ల రహదారి, ప్రభుత్వ పాలిటెక్నిక్, అగ్రికల్చర్, పీజీ కాలేజీల ఏర్పాటు, కరోనా సమయంలో ఆక్సిజన్ సిలిండర్ల అందజేత వంటి కార్యక్రమాలను జగ్గారెడ్డి చేపట్టారని తెలిపారు. సంగారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి జగ్గారెడ్డితోనే సాధ్యమైందన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా, గుర్తుకు వచ్చే పేరు జగ్గారెడ్డిదేనని వివరించారు. ప్రజల కష్టాలు తీర్చే నాయకుడు జగ్గారెడ్డి అని గుర్తు చేశారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లె సత్యనారాయణ, మండల అధ్యక్షులు మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఏఈ పని తీరుపై ప్రజాప్రతినిధుల అగ్రహం

• మంత్రి దామోదర్ సహకారంతో 2వేల కోట్లతో అభివృద్ధి పనులు
• ప్రజా ప్రతినిధులు అధికారుల సమిష్టి కృషితోనే అభివృద్ధి
• గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య



**రాయికోడ్,ఆగస్టు11, (జనంసాక్షి):** విద్యుత్ ఏఈ,పలువురు ఇతర అధికారుల పనితీరుపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అగ్రహారం వ్యక్తం చేశారు.మంగళవారం ఎంపీడీవో ఎంఏ షరీఫ్ అధ్యక్షతన రాయికోడ్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి లు ముఖ్య అతితులుగా హాజరయ్యారు. విద్యుత్ సహాయ ఇంజనీర్ ఎప్పుడు ఫోన్ చేసిన అందుబాటులోకి రావడం లేదని ఎప్పుడు కూడా కార్యాలయంలోకి అసలే రాడని పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకు వచ్చారు. మరి కొంతమంది అధికారులు సమావేశానికి రాకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. అలాంటి అధికారులపై తక్షణమే శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డిలు ఎంపీడీవోకు సూచించారు. 218 కోట్లతో అల్లదుర్గం మెటల్ కుంట రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి అన్నారు. ప్రభుత్వ హాస్టల్లో పాఠశాలలతో పాటు అన్ని గ్రామాలలో కల్వర్టులు సిసి రోడ్డు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని గుర్తు చేశారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో నివేదికను చదివి వినిపించారు. చర్ల రాయిపల్లి సర్పంచ్ కాశీ బసవ రాజ్ పటేల్ విద్యుత్తు అంగన్వాడీ సిబ్బంది వ్యవహార శైలి మార్చుకోవాలని ఆయన సూచించారు. హయా శాఖల అధికారులు పలుమార్లు సమస్యలు విన్నవించిన పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన విమర్శించారు. షాపూర్ సర్పంచ్ నాగేశ్వరరావు తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డితోపాటు మండల వ్యవసాయ అధికారి శ్రీమతి సారిక రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం
## మొక్కల నరికివేతపై స్థానికుల ఆగ్రహం



**టేక్మాల్, ఆగస్ట్ 11 (జనంసాక్షి):** పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా రహదారుల వెంట నాటిన మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. మొక్కలను నరికివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పచ్చదనం పెంపునకు నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలు పెరిగితే పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా మొక్కలను నరికివేయడం బాధాకరమని స్థానికులు పేర్కొన్నారు. మొక్కల నరికివేతకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించాలని కోరుతున్నారు. బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## మృతుడి కుటుంబానికి
## మాజీమంత్రి హరీష్ రావు ఆర్థిక సాయం



**నంగునూర్, ఆగస్టు 11 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజ్ గోపాల్ పేట గ్రామానికి చెందిన మధిర గ్రామం శివాజీనగర్‌లోని గౌరబోయిన సంతోష్ ఇటీవల ట్రాక్టర్ దున్నుతుండగా, ట్రాక్టర్ బోల్తా పడటంతో దాని కింద పడి మృతి చెందాడు ఇట్టి విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా ఆ కుటుంబానికి 10,000 పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కమల్ షరీఫ్ ,కోనేటి సత్యం, రంగు రాజు గౌడ్, పరమాండ్ల మల్లేశం ,జాజాల చందు ఎల రాజేంద్ర, కాటం రాజేష్ ,బాలచారి, ఈజారుద్దీన్ జనార్ధన్ ముంద్రాతి యాదగిరి, ఈశ్వరయ్య బిక్షపతి గౌరవైన మల్లేశం యాదగిరి ఐలయ్య రాజయ్య జావేద్ పలువురు పాల్గొన్నారు.

# రైతుల భూములు.. ప్రజల ఆరోగ్యమే మా లక్ష్యం

- ఇథనాల్ ఫ్యాక్టరీల రద్దు కోసం అఖిలపక్షం డిమాండ్
- జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం.. ఫ్యాక్టరీలపై ప్రజల్లో తీవ్ర ఆందోళన



**బెజ్జంకి, ఆగస్టు 11(జనంసాక్షి):** బెజ్జంకి మండలం గుగ్గిళ్ల, పోతారం గ్రామాల శివార్లలో ఏర్పాటు చేసిన రెండు ఇథనాల్ ఫ్యాక్టరీలను వెంటనే రద్దుచేయాలని బెజ్జంకి అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీల కారణంగా తీవ్రమైన దుర్వాసనలు, వ్యర్థాల సమస్యతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో పిల్లలు,వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫ్యాక్టరీల వ్యర్థాలను సాగునీటి కాలువల్లోకి విడుదల చేస్తున్నారనే ఆరోపణలతో రైతుల్లో ఆందోళన నెలకొంది అనీ అన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీల ప్రభావం చుట్టుపక్కల సుమారు 15 గ్రామాల ప్రజలపై పడుతోందని అఖిలపక్షం నాయకులు అన్నారు. ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు భూగర్భజలాలు, సాగునీరు, పంటలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం, రైతుల జీవనోపాధి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫ్యాక్టరీల కార్యకలాపాలను నిలిపివేసి, వాటి అనుమతులను రద్దు చేయాలని కోరారు. ఫ్యాక్టరీల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఇప్పటికే వందలాది మందితో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించామని, బెజ్జంకి మండల బంద్‌ను విజయవంతంగా నిర్వహించామని నాయకులు గుర్తు చేశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాక పోవడంతో జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. “రైతుల భూములు, నీరు కలుషితం కాకూడదు ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే పరిశ్రమలు మాకు అవసరం లేదు. ఇథనాల్ ఫ్యాక్టరీలను రద్దు చేసే వరకు ప్రజల పక్షాన అఖిలపక్షం పోరాటం కొనసాగిస్తుంది” అని నాయకులు స్పష్టం చేశారు. ఈ వినతి పత్రం అందజేత కార్యక్రమంలో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, డీఎస్పీ తదితర పార్టీల అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

# మల్కాపూర్ తండాలో ఆత్మపథకం ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన

**పెద్ద శంకరంపేట, ఆగస్టు 11(జనంసాక్షి):** మండలంలోని మల్కాపూర్ గట్టు కింది తండా గ్రామపంచాయతీ పరిధిలోని మల్కాపూర్ తండాలో ఆత్మ పథకం కింద మంగళవారం వరి సాగులో నానో యూరియా మరియు జింక్ పిచికారి చేసే విధానంపై రైతులకు ప్రత్యక్ష క్షేత్రప్రదర్శన నిర్వహించారు. స్థానిక రైతు దాదాయిపల్లి సాయిలు తన నేరుగా విత్తిన వరి పొలంలో నానో యూరియా మరియు జింక్ మిశ్రమాన్ని నీటిలో ఏ విధంగా కలపాలి, ఏ పద్ధతిలో పిచికారి చేయాలో రైతులకు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ మరియు వ్యవసాయ విస్తరణ అధికారి ాజూవినీత్ పాల్గొని, ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో రైతులు దాదాయిపల్లి సాయిలు, చిన్న బాగయ్య గారి సాయిలు, దేవసొత్ ప్రవీణ్ తో పాటు ఇతర రైతులు పాల్గొన్నారు మండల




వ్యవసాయ అధికారి నాగం కృష్ణ మాట్లాడుతూ...

**నానో యూరియా ఉపయోగాలు:**

1. సాంప్రదాయ యూరియా వాడకాన్ని గణనీయంగా తగ్గించవచ్చు (సుమారు50% వరకు)
2. నేల మరియు నీరు కాలుష్యం బారిన పడకుండా రక్షించవచ్చు అని ఆయన తెలిపారు.
3. మొక్కల ఆకులు నానో యూరియాను వేగంగా పీల్చుకోవడం వల్ల త్వరగా ఫలితం కనిపిస్తుంది.
4. జింక్ లోపంతో ఆకులు తెల్లగా మారడం లేదా తుప్పు పట్టినట్లు కావడాన్ని నివారిస్తుంది.
5. మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ మెరుగుపడటానికి, వేరు వ్యవస్థ బలపడటానికి తోడ్పడుతుంది.
6. నేరుగా విత్తిన వరి (DSR) సాగు ప్రయోజనాలు
7. నారు పోసి నాట్లు వేసే పద్ధతితో పోలిస్తే నీటి వినియోగం చాలా వరకు తగ్గుతుంది.
8. కూలీల ఖర్చు ఆదా అవుతుంది, పంట త్వరగా చేతికి వచ్చే అవకాశం ఉంటుంది అని వివరించారు.

## హితోధిక సహాయం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం: ఎంఈవో బుచ్చా నాయక్

- పిడి చంద్రమోహన్‌కు అభినందనలు



**శివ్వంపేట, ఆగస్ట్ 11(జనంసాక్షి):** విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని బాగా చదువుకొని జీవితంలో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి బుచ్చా నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ విధులు నిర్వహిస్తున్న చంద్రమోహన్ అనే ఉపాధ్యాయుడు తన తల్లిదండ్రులైన రంగయ్య చంద్రకళ దంపతుల జ్ఞాపకార్థంగా 2025 26 సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల టాపర్‌గా వచ్చిన మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రేవతికీ ప్రథమ మహుమతి కింద 5 వేల రూపాయలు అందజేసి, శాలువా మెమెంటులతో సత్కరించారు. మండల పరిధిలోని చండి గ్రామానికి చెందిన కిషోర్ గౌడ్‌కు ద్వితీయ బహుమతి కింద 3 వేల రూపాయలు అందజేసి, శాలువా జ్ఞాపికలతో సత్కరించారు. అదేవిధంగా మండల కేంద్రమైన శివ్వంపేట గ్రామానికి చెందిన అనుశ్రీ కి తృతీయ బహుమతి కింద 2 వేల రూపాయలు ఇచ్చి, శాలువా మెమెంటో అందజేశారు. ఇదే కార్యక్రమంలో శివ్వంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయిని మాధవి తన వంతు సహాయంగా మండల టాపర్ గా వచ్చిన రేవతికి మరో 5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి గంగాల రమేష్, స్థానిక ఎంఈఓ బుచ్చానాయక్, ఎచ్ ఎం బాలచంద్రం లు మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులు రాణించిన వారికి ఈ నగదు పురస్కారం ఎంతో ప్రేరణ కలిగిస్తుందని, వారితోపాటు ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులకు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఇటువంటి నగదు బహుమతి ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని వారి లక్ష్యసాధనకు చిత్తశుద్ధి, అంకితభావంతో కూడిన విద్యను నేర్చుకుంటూ, నిరంతరం ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను నెమరేసుకుంటే ఇంకా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం వంటి జాతీయ నేతలను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని వారు విద్యార్థులకు ఉద్బోధించారు. అనంతరం విద్యార్థులకు ఆర్థిక బహుమతులుగా సాయం అందించిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, కార్యక్రమ నిర్వాహకులు చంద్రమోహన్, మరో ఉపాధ్యాయిని మాధవిలను ఎంఈఓ, హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయ బృందం మనస్ఫూర్తిగా అభినందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యూ రాష్ట్ర నాయకులు నర్సాగౌడ్, మండల అధ్యక్షుడు అనిల్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీ హర్ష, సంయోద్దీన్, ప్రసాద్, చక్రు నాయక్, కే. శ్రీనివాస్, ఈశ్వర్ ప్రసాద్, హేమ, మాధవి, రాధాబాయి, శ్రీలత, విజయలక్ష్మి, సమత, అనిత, మానస లతోపాటు విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కృష్ణ మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



**కృష్ణ, ఆగస్టు 11(జనంసాక్షి):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మక్తల్ నియోజకవర్గంలో క్రిష్ణ మండలంలో జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఎన్ను కన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వచ్చిన మంద నర్షింహ మాదిగ మాట్లాడుతూ నూతన మండల నాయకులను అభినందిస్తూ మందకృష్ణ అన్న 30 సంవత్సరల పోరాట విజయాలను వివరించారు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు గుడిసె వెంకటయ్య మాదిగ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ ఎమ్మెర్పీస్‌లో మంచిగా పోరాటం చేస్తూ మండలం నుండి జిల్లా రాష్ట్ర జాతీయ నాయకత్వం వరకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా నాయకులు జి హన్మంతు,ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి బోడి తేజ మాదిగ , వెంకటేష్ మాదిగ క్రిష్ణ మాదిగ క్రిష్ణ మండలం నూతన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నారాని తిమ్మయ్య, ఉపాధ్యక్షులు గుర్జల్ హన్మంతు అధికారప్రతినిది చిన్నమేటి హన్మంతు ప్రధాన కార్యదర్శిలు కర్రె మొల సంతోష్ కుమార్, పరుశురాం ఉపాధ్యక్షులు కావాలి హనుమంతు, అనిపేగి మహేందర్, దాసరి మారుతి. కోశాధికారి బోడోల తిమ్మప్ప కార్యదర్శులు కొనింటి సురేష కర్రెప్ప, చిన్న మేటి ఓబులేష్, జగిలి నరసింహ, పల్లే రమేష్, ఆశాది శంకర్, కోలా నరసింహ, ఆసాది జిందప్ప, అంజప్ప, కంప్లీ లింగప్ప, దెవేంద్రప్ప, అశోక తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు



**టేక్మాల్, ఆగస్టు 11(జనంసాక్షి):** టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌ను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు, మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని ఎస్పీ పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర నియంత్రణకు రాత్రి గస్తీ, వాహన తనిఖీలు, నాకాబందీలను పటిష్ఠంగా నిర్వహించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నవారిపై ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేరాల పునరావృతాన్ని అరికట్టేందుకు బీట్ పోలీసింగ్‌ను మరింత పటిష్ఠం చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ దుష్ప్రభావాలపై గ్రామాలు, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి, మోసానికి గురైన వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించి, అవసరమైన ప్రాంతాల్లో వాటి ఏర్పాటుకు కృషిచేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, ఫిర్యాదులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట సీఐలు రేణుకరెడ్డి, సందీప్‌రెడ్డి, ఎస్ఐ అరవింద్ ఉన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కేసుపై హుస్నాబాద్ ఏసీపీ విచారణ

- భూమి ఆక్రమణ, ఒత్తిడిపై ఫిర్యాదు



**చేర్యాల, ఆగస్టు 11(జనంసాక్షి):** తాడూరు గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. తాడూరు గ్రామానికి చెందిన చింతల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తనకు సంబంధించిన భూమిని అక్రమంగా దున్నించి, చెట్లను ధ్వంసం చేసినట్లు, అంతేకాకుండా భూమిని అమ్మమని ఒత్తిడి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై మంగళవారం హుస్నాబాద్ ఏసీపీ సదానందం గ్రామానికి వచ్చి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలి వద్ద వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్, ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి పాల్గొన్నారు.

## హన్వాడలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ హరిప్రియ



**హన్వాడ, ఆగస్టు 11(జనంసాక్షి):** హన్వాడ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయ తలపెట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రతిపాదిత స్థలాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మంగళవారం నాడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హన్వాడ మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ (2బీహెచ్‌కే) ఇళ్లకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని పాఠశాల నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదించారు. ఈ పర్యటనలో భాగంగా అదనపు కలెక్టర్ స్థానిక తహసీల్దార్, మండల సర్వేయర్‌తో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని నిశితంగా పరిశీలించారు. అనంతరం భూమికి సంబంధించిన రికార్డులను, సరిహద్దుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాల భవన నిర్మాణానికి ఈ స్థలం ఎంతవరకు అనువుగా ఉంటుంది. భూమి విస్తీర్ణం ఎంత రవాణా సౌకర్యాలు ఎలా ఉన్నాయి? అనే అంశాలపై అధికారుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిపారు. ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన పూర్తి నివేదికను సిద్ధం చేయాలని, పాఠశాల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉండేలా అవసరమైన తదుపరి చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## సిపిఐఎం రాజకీయ శిక్షణ తరగతులు

**అమరచింత, ఆగస్టు 11(జనంసాక్షి):** మంగళవారం సి.పి.ఐ ఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు రెండు రోజులు నిర్వహించనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి జీస్ గోపి తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో భారతదేశ రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై పోరాటాలు, కార్మిక కర్షక ఉద్యమాల ప్రాధాన్యత, పార్టీ నిర్మాణం తదితర అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పిట్టల రవి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు రాజకీయంగా, సిద్ధాంతపరంగా మరింత చైతన్యవంతులై ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పోరాడేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు .ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటేష్, ఆర్ ఎన్ .రమేష్, ఎస్ అజయ్,టీ.రాఘవేంద్ర ఆత్మకూరు మండల కార్యదర్శి ఎస్ రాజు,పార్టీ సీనియర్ నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



**సంగారెడ్డి, ఆగస్టు 11(జనంసాక్షి):** సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలో ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర్ రావు దేశ్‌పాండే పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి ఇంటికీ చేర్చడం, జాతీయ జెండా గౌరవాన్ని కాపాడడం, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని వారు పేర్కొన్నారు. ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డితో పాటు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు



**చేర్యాల, ఆగస్టు 11(జనంసాక్షి):** ఇందిరమ్మ ఇళ్ల విషయంలో సంబంధిత దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చేర్యాల హౌసింగ్ ఏఈ మౌనిక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలోని నివాసితులు స్థానిక ఎంపీడీఓ ఆఫీసులో చేర్యాల పట్టణవాసులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా రెండో విడతలో గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని, అనంతరం ఎల్-1 జాబితాలోని అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు.

## రేవల్లి మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం



**రేవల్లి, ఆగస్టు 11 (జనంసాక్షి):** రేవల్లి మండల సర్పంచుల సమావేశం మంగళవారం రేవల్లి గ్రామంలోని సర్పంచ్ టప్పు రాజయ్య నివాసంలో జరిగింది. రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి సుల్తాన్ అలీ, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వాడల పర్వతాలు గార్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేవల్లి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులుగా: బాదేపల్లి రేవతి గౌడ్, ఉపాధ్యక్షులు: టప్పు రాజయ్య, ప్రధాన కార్యదర్శి: సభావత్ శ్రీను నాయక్, కోశాధికారి: జి. పావని, కార్యదర్శులుగా లోడే అంజలమ్మ, పాంపురం రేణుక, బి. రాజు లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు బాదేపల్లి రేవతి సురేష్ గౌడ్ మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండి సుల్తాన్ అలీ, వాడల పర్వతాలు, బాదేపల్లి రేవతి గౌడ్, టప్పు రాజయ్య, సభావత్ శ్రీను నాయక్, జి. పావని, లోడే అంజలమ్మ, పాంపురం రేణుక, బి. రాజు, మిద్దె స్వామి తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో.."కీలకం కానున్న సర్ - 2026 ఓటరు జాబితా"..!

- మండలంలోని 49141 ఓటర్లకు గాను 8219 ఓట్ల తొలగింపు





**న్యాల్‌కల్, ఆగస్టు 11(జనంసాక్షి):** భవిష్యత్తులో.. ఎంతో కీలకం కానున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని మండలంలో అధికారుల బృందం శతశాతం పూర్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు.. మండలంలోని ఎన్నికల అధికారుల బృందం "సర్" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సఫలీకృతమయ్యారు. మండలంలోని 62 బిఎల్ఓ లకు, ఆరుగురు పరిరక్షణలో.. మండల ఎన్నికల అధికారి తహసిల్దార్ ప్రభువులు, ఉప తహసిల్దార్ రాజిరెడ్డి, రెవిన్యూ ఇన్స్ స్పెక్టర్ శ్యామ్ రావు, 62 బిఎల్ఓ లకు గాను 7గురు పర్యవేక్షకులు, రెవెన్యూ అధికారుల బృందం, పంచాయతీ రాజ్, అంగన్వాడి కార్యకర్తలు, తదితరుల అధికారుల బృందంతో "సర్ ప్రక్షాళన" కార్యక్రమాన్ని చేపట్టారు.

### మండలంలో 8219 ఓట్ల తొలగింపు...

మండలంలోని 38 గ్రామ పంచాయతీల్లోని 49141 ఓటర్లకు గాను 40922 ఓటర్లను అంతర్జాలంలో నమోదును పూర్తి చేశారు. చేపట్టిన సర్ ప్రక్షాళనలో.. 1559 ఓటర్లు మృతి చందగా, రెండుచోట్ల వేరు వేరు ఓటర్లు ఉండకుండా.. నేరుగా 3875 గురు ఓటర్లు వారి వారి అభీష్టం మేరకు ఒకేచోట శాశ్వతంగా ఓటును నమోదు చేసుకున్నారు. 1803 గురు ఓటర్లకు బిఎల్వోలు వ్యక్తిగతంగా వారి వారి స్వగృహం, స్వగ్రామానికి వెళ్లి పత్రాలను అందజేసిన తిరిగి బిఎల్ఓ లకు అందజేయలేక పోవడంతో తొలగించబడ్డాయి. మండలంలోని మొత్తం ఓటర్ల సంఖ్య 49141 ఉండగా.. 8219 ఓటర్లను వివిధ కారణాలతో తొలగించబడ్డాయి. ఎట్టకేలకు మండలంలో అధికారుల బృందం శతశాతం సర్ ప్రక్షాళన పూర్తి చేపట్టారు. మండలంలో 83.27 శాతం మేరకు నమోదు పూర్తి చేసినట్లు మండల ఎన్నికల అధికారులు తెలిపారు.

## ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలించిన డిపో మేనేజర్

- మరమ్మత్తులకు సహకరిస్తానన్న సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**వెల్దండ, ఆగస్టు 11(జనంసాక్షి):** వెల్దండ మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని కల్వకుర్తి డిపో మేనేజర్ శాలిని వెల్లడించారు. మంగళవారం గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ తో కలసి బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు.ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమగు మరమ్మతులకు సహకరించాలని డిపో మేనేజర్ సర్పంచును కోరారు. సానుకూలంగా స్పందించిన సర్పంచ్ మరమ్మతులకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు, త్రాగునీరు, ప్రయాణికులు కూర్చోవడానికి బెంచీలు,విద్యుత్ బల్బులు, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని మేనేజరుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవా, కంట్రోలర్ మల్లయ్య,వార్డు సభ్యులు మసిగుండ్ల వెంకటేష్,నాయకులు తిరుపతిరెడ్డి, ఎండి రషీద్, రాహుల్ తదితరులు ఉన్నారు.

### నూతన వ్యవసాయ
## అధికారిణిగా శ్రీదేవి బాధ్యతల స్వీకరణ



**రేగోడ్, ఆగస్ట్11(జనంసాక్షి):** రేగోడ్ మండల నూతన వ్యవసాయ అధికారి ణిగా మంగళవారం శ్రీదేవి బాధ్యతలు స్వీక రించారు. నర్సాపూర్ డివిజన్ టెక్నికల్ వ్యవ సాయ అధికారిగా విధులు నిర్వహించిన అనంతరం బదిలీపై రేగోడ్ మండలానికి వచ్చిన వ్యవసాయ అధికారి శ్రీదేవికి ఇప్పటి వరకు రేగోడ్ మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన రాంప్రసాద్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మండలంలోని రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సలహాలు మరియు నూతన సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కృషిచేస్తానని తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటి కప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పనిచేస్తున్న కార్మికుడిపైకి దూసుకెళ్లిన కారు

- బుర్రవాగు స్టేజ్ వద్ద ఘోర ప్రమాదం.. వంతెన మధ్యలో కారు బోల్తా
- బీహార్ కార్మికుడు అక్కడికక్కడే మృతి.. పలువురికి గాయాలు



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 11(జనంసాక్షి):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బుర్రవాగు స్టేజీ సమీపంలో జాతీయ రహదారి-44పై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రహదారి వంతెన పనులు చేస్తున్న కార్మి కుడిని కారు ఢీకొట్టడంతో అదుపుతప్పి వంతెన మధ్యలోనే బోల్తా పడింది. ఈ ఘటనలో బీహార్‌కు చెందిన కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న పలు వురికి గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుడి వివరాలు, ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### పుణే-బారామతి
## 100 కి.మీ అల్ట్రారన్ పూర్తి చేయడం సంతోషకరం



**సిద్దిపేట, (జనంసాక్షి):** పుణే-బారామతి 100 కిలోమీటర్ల అల్ట్రా రన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సిద్దిపేట రన్నర్ అసోసియేషన్ అధ్య క్షుడు, జర్నలిస్ట్ నూని గాని రాజును మంగళ వారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రంగాచారి రాజును శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రంగాచారి మాట్లాడుతూ.. సుదీర్ఘ దూర పరుగు పోటీలో 100 కిలోమీటర్ల అల్ట్రా రన్‌ను పూర్తి చేయడం అభినందనీయ మన్నారు. ఓ పక్క జర్నలిస్టుగా తన వృత్తి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే, మరోపక్క ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. క్రీడారంగంలోనూ తన ప్రతిభను చాటుకుంటున్న నూనిగాని రాజు 100 కిలోమీటర్ల అల్ట్రా రన్‌ను విజయవంతంగా పూర్తి చేసి సిద్దిపేటకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. రాజిరెడ్డి, రంగధాం పల్లి శ్రీనివాస్ గౌడ్, , మైసారెడ్డి, షణ్ముఖ రాజు, భాస్కర్, యాదగిరి గౌడ్, మహేష్, శ్రీనివాస్, మల్లారెడ్డి, మజ్జు, సాజిద్ పాషా, ప్రసాద్, ఇంద్ర శేఖర్, సాయి, రాజబాబు, అరుణ్ , వెంకట్, నరేష్, సత్యనారాయణగౌడ్, భాస్కర్ , శ్రీకాంత్, ప్రశాంత్, సంతోష్, ఇంద్ర సేన రెడ్డి, శ్రీనాథ్, వంశీ, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఫుడ్ కమిషన్ చైర్మన్ పరామర్శ

- రూ.5 వేల రూపాయల ఆర్థిక సహాయం



**వెల్దండ, ఆగస్టు 11 (జనంసాక్షి):** వెల్దండ మండలం, చేర్కూర్ గ్రామానికి చెందిన గుడే రాములు కుమారుడు మహేష్ ఇటీవల మృతి చెందిన విష యం గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీని వాసులు ద్వారా తెలుసుకున్న తెలం గాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి గారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం వారి కుటుంబా నికి అండగా నిలుస్తూ రూ.5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్ర మంలో కల్వకుర్తి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సింగం విజయ్ గౌడ్,మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్,గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు,మాజీ అధ్యక్షులు జోగాయ్య,మాజీ సర్పంచులు రామచంద్రయ్య,అంజి నాయక్,మైసయ్య,మాజీ ఎంపీటీసీ భీమయ్య,ఉప సర్పంచ్ కొండల్,మాజీ ఉప సర్పంచ్ నర్సింహా,గణేష్,దాసు,తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌కు రైల్వే కోసం ఎంపీ మల్లు రవి చొరవ

- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన ఎంపీ



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గానికి రైల్వే అనుసంధానం కల్పించేందుకు ఎంపీ డాక్టర్ మల్లు రవి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నాగర్‌కర్నూల్ మీదుగా వెళ్లే ప్రతిపాదిత డోర్నకల్-గద్వాల్ రైల్వే లైన్‌కు సంబంధించిన సర్వే, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, రైల్వే లైన్‌కు త్వరితగతిన మంజూరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి కలిసి డోర్నకల్-గద్వాల్ రైల్వే లైన్‌కు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజక వర్గం, తెలంగాణలోని చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి రైల్వే అను సంధానం అత్యంత కీలకమని ఆయన కేంద్ర మంత్రికి వివరించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు చాలాకాలంగా మెరుగైన రైల్వే సదుపాయం కోసం ఎదురుచూస్తున్నారని మల్లు రవి తెలిపారు. ప్రతిపాదిత రైల్వేలైన్ నిర్మాణం పూర్తయితే ప్రజల రాక పోకలు సులభతరం కావడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

రైల్వే అనుసంధానం ద్వారా వ్యవసాయం, వ్యాపారం, పరిశ్రమలు, విద్య, వైద్యం, పర్యాటకం తదితర రంగాలకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని మల్లు రవి వివరించారు. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన నాగర్‌కర్నూల్‌లో రైతులు తమ ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు వేగంగా, తక్కువ ఖర్చుతో రవాణా చేసుకునేందుకు రైల్వే సదుపాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైల్వే మార్గం అందుబాటులోకి వస్తే కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. డోర్నకల్-గద్వాల్ రైల్వే లైన్‌కు సంబంధించిన సర్వేను వేగవంతం చేసి, డీపీఆర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని మల్లు రవి కేంద్ర రైల్వే మంత్రిని కోరారు. అనంతరం ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు, నిధుల మంజూరు ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి రైల్వే అనుసంధానం కీలకమైన మౌలిక వసతిగా ఆయన పేర్కొన్నారు. ఈ రైల్వే లైన్ ఏర్పాటుతో నాగర్‌కర్నూల్‌తో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాలకు మెరుగైన రవాణా అనుసంధానం ఏర్పడుతుందని తెలి పారు. ప్రజల చిరకాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఎంపీ మల్లు రవి విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పం దించినట్లు తెలిపారు.

డోర్నకల్-గద్వాల్ రైల్వే లైన్‌కు సంబంధించిన ప్రతిపాదనను తగిన విధంగా పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు మల్లు రవి వెల్ల డించారు. నాగర్‌కర్నూల్ ప్రజల రైల్వే కలను సాకారం చేసేందుకు తన వంతు కృషిని కొనసాగిస్తానని మల్లు రవి తెలిపారు. నియోజక వర్గ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి ప్రజల సమస్యలను తీసుకెళ్లి పరిష్కా రానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా సుధాకర్ రెడ్డి



**నారాయణపేట ఆగస్టు11(జనంసాక్షి):** నారాయణపేట మండలం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా గుర్మిట్కాల్ సుధాకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదివరకు రెండు సార్లు అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టి మళ్లీ మూడోసారి సంఘం అధ్యక్షులు గా బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులుగా శ్రీనివాస్, ఉప అధ్యక్షులుగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా బాల్‌రాజు, కోశాధికారిగా సుధాకర్‌ను ఎన్ను కున్నారు. మర్యాదపూర్వకంగా తహసీల్దార్ కార్యాల యంకు వెళ్లగా తహసీల్దార్ నూతన అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డిని శాలువలతో సత్కరిం చారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ గఫూర్, బన్నప్ప, భూపతిరెడ్డి, రఘు, అశమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్ చెరువు పరిరక్షణకు 3 కోట్లతో డ్రైనేజీ పనులు



**ఆత్మకూర్, ఆగస్టు 11(జనంసాక్షి):** ఆత్మకూర్ మండల అభివృద్దే ధ్యేయంగా గౌరవనీయులైన మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి చొరవతో ఆత్మకూర్ చెరువులోకి మురికినీరు చేరకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాగేశ్వర్ తెలిపారు. దాదాపు 3 కోట్ల రూపాయల వ్యయంతో చెరువు చుట్టూ డ్రైనేజీ వ్యవస్థను పైప్‌లైన్ల ద్వారా ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. చెరువు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపట్టడం జరిగిందన్నారు.అక్కడక్కడ మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేసి, పట్టణంలోని మురికికాలువల ద్వారా వచ్చే నీరు పైప్‌లైన్ల ద్వారా నేరుగా వెళ్లిపోయే విధంగా వ్యవస్థను రూపొందించినట్లు పేర్కొన్నారు. దీంతో ఆత్మకూర్ చెరువు కలుషితం కాకుండా రక్షణ లభించనుందని తెలిపారు.

# శృంగేరి పీఠాధిపతి చేతుల మీదుగా ప్రశంసా పత్రం



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి):** అద్వైత మత స్థాపనాచార్యులు, జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యులు స్థాపించిన శ్రీ శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలో కర్ణాటకలో నిర్వహించిన మూడు రోజుల పద్య రచన సాహితీ, పురోహిత శిక్షణా శిబిరంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన అర్చక పురోహితులు బస్వోజు సాయి చంద్రకాంత్ ఆచార్యులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీ శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామీజీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేశారు.పద్య రచన, సాహితీ ప్రతిభతో పాటు పురోహిత శిక్షణలోనూ విశేష ప్రతిభ కనబరిచిన సాయి చంద్రకాంత్ ఆచార్యులను శిబిర నిర్వాహకులు అభినందించారు. శృంగేరి శారదా పీఠం వంటి మహోన్నత ఆధ్యాత్మిక సంస్థ నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని, పీఠాధిపతి ఉత్తరాధికారి స్వామీజీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడం తన జీవితంలో ఎంతో గౌరవప్రదమైన సందర్భమని సాయి చంద్రకాంత్ ఆచార్యులు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన అర్చక పురో హితులు శృంగేరి పీఠం నిర్వహించిన ప్రతిష్ఠాత్మక శిక్షణా కార్యక్రమం లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల పలువురు ఆధ్యాత్మికవేత్తలు, అర్చకులు, పురోహితులు, సాహితీప్రి యులు అభినందనలు తెలిపారు.

తాజాగా..

## "చేయూత పెన్షన్ల" కోసం దరఖాస్తుల ఆహ్వానం

- మండల అభివృద్ధి అధికారిణి షాగుప్తా ఇర్షత్
- నేటి నుండి ఈ నెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ



**న్యాల్‌కల్, ఆగస్టు11(జనంసాక్షి):** ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు తాజాగా.. అర్హులైన అభ్యర్థుల నుండి "చేయూత పెన్షన్ల"ను పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారిణి షాగుప్త ఇర్షత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు."చేయూత పెన్షన్ల"ను పొందేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల12 నుండి 31 వరకు మండల పరిషత్ కార్యాలయం, మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హులైన వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు డయాలిసిస్, ఫైలేరియా వ్యాధిగ్రస్తులు, తదితరులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ సూచించారు. మరింత సమాచారం కోసం మండల పరిషత్ కార్యాలయాన్ని, మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని ఎంపీడీఓ సూచించారు.

వృద్ధాప్య బీడీ కార్మికుల

## పెన్షన్ల కోసం తాహసిల్దార్‌కు వినతి

**అమరచింత, ఆగస్టు 11(జనంసాక్షి):** వ్యవసాయకార్మిక సంఘంఈ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అధ్యక్షులు యస్ అజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేయూత ద్వారా కొత్త పెన్షన్లకు దరఖాస్తులు పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వగా అందులో కేవలం వితంతు ఒంటరి మహిళ వికలాంగులు డయాలసిస్ తల సేమియా లాంటి కొన్ని వందల మంది ఉన్నటువంటి వారికి మాత్రమే కొత్త పెన్షన్లకు అవకాశం కల్పించడం సరికాదని విమర్శించారు. పెద్ద ఎత్తున ఉన్నటువంటి వృద్ధులు బీడీ కార్మికులకు కూడా చేయూత ద్వారా పెన్షన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల తరబడి వృద్ధులు బీడీ కార్మికులు కొత్త పెన్షన్లకు అవకాశం వస్తదని వేచి చూసినప్పటికీ ఇన్నేళ్ల తర్వాత వేసిన నోటిఫికేషన్ లో సైతం వృద్ధులు బీడీ కార్మికులకు అవకాశం కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం స్పందించి వృద్ధులు బీడీ కార్మికులకు పెన్షన్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మండల అధ్యక్షుడు కే. శంకర్ విష్ణు.మోహన్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ తోటల్లో వీవిల్ విడుదల

**హవేలీ ఘనపూర్, ఆగస్టు 11(జనంసాక్షి):** మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలంలోని ప్రభు వరగౌడ్‌కు చెందిన ఆయిల్‌పామ్ తోటల్లో పరాగసంపర్కం కోసం ఉద్యాన శాఖ అధికారుల ఆధ్వర్యంలో "ఎలిడోబియస్ కెమెరోనికస్" వీవిల్‌ను విడుదల చేశారు. వీవిల్‌ను విడుదల చేయడం ద్వారా పరాగసంపర్కం మెరుగై, ఫలదీకరణ జరిగి గెలల ఏర్పాటు పెరుగుతుందని, తద్వారా ఆయిల్‌పామ్ దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె. ప్రతాప్ సింగ్ తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె. ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ రైతులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సరైన సమయంలో వీవిల్‌ను విడుదల చేయడం ద్వారా మెరుగైన ఫలదీకరణ సాధించి అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి ఎప్పటికప్పుడు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి అవసరమైన సూచనలు, సలహాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె. ప్రతాప్ సింగ్, హవేలీఘనపూర్ వ్యవసాయ అధికారి బాల్‌రెడ్డి, ఉద్యాన అధికారి రచన, లీవ్ పామ్ కంపెనీ మేనేజర్ కృష్ణ, కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారిణి తేజస్విని, ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా.. భవిష్యత్తుకు బాటగా

- యువతకు ఎస్పీ పిలుపు
- ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన మెదక్ ప్రెస్‌క్లబ్
- సైబర్ మోసాలపై అవగాహనే ఆయుధం
- ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే నేరాలకు అడ్డుకట్ట
- మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు
- జిల్లా ఎస్పీ.డి.వి.శ్రీనివాస రావు




**మెదక్ బ్యూరో, ఆగస్టు 11(జనంసాక్షి):** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. నూతనంగా ఎన్నికైన మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌తో పాటు మెదక్ పట్టణానికి చెందిన మీడియా ప్రతినిధులు మంగళవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎస్పీ అభినందించారు.
**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ..** సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఓటీపీ, పిన్, సీవీవీ, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్పీ పేర్కొన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.
మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలు, విద్యార్థినుల్లో చైతన్యం కల్పిస్తున్నామని చెప్పారు. మహిళలు, బాలికలు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.ప్రజలకు మరింత చేరువగా పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణలో ప్రజలతో పాటు మీడియా సహకారం కీలకమన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. మహిళలు, బాలికల భద్రత కోసం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలనకు చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా తరఫున పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, కోశాధికారి చెవిటి అశోక్, గౌరవ కార్యవర్గ సభ్యులు కామాటి కృష్ణ, నీలం, శ్రీధర్, సందీప్, రమేష్, సిద్ధు, రాజాగౌడ్, రహమత్, ఫణిరాజ్, శ్రీహరిగౌడ్, కార్తీక్, సుబ్బు, మల్లేశం, ఫని పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# CPI ప్రచార జాత యాత్ర ప్రారంభం

- ధరల పెరుగుదల, ఈవీఎంలపై ఆందోళన వ్యక్తం చేసిన నేతలు



**ఆత్మకూర్, ఆగస్టు 11 (జనంసాక్షి):** భారత కమ్యూనిస్టు పార్టీ CPI ఈనెల 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు చేపట్టిన ప్రచార జాత యాత్రలో భాగంగా సోమవారం రేజింతల గ్రామంలో కార్యక్రమం ప్రారంభమైంది. రేజింతల గ్రామంలోని CPI జెండా కట్ట వద్ద పార్టీ ఆత్మకూర్ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ శెట్టి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మక్తల్ నియోజకవర్గ CPI కార్యదర్శి టి. శ్రీహరి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, వాటిని నియంత్రించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. నిరుద్యోగ సమస్య తీవ్రమైందని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకుంటున్న ప్రభుత్వం EVMల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తూ అనేక అవకతవకలకు పాల్పడుతోందని విమర్శించారు. అనేక మంది మేధావులు, సాంకేతిక నిపుణులు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం పేపర్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరుగుతున్నాయని, మన దేశంలో కూడా అదే విధంగా నిర్వహించాలనేది ప్రధాన డిమాండ్ అని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, ప్రజలను చైతన్య పరిచేందుకే ఈ జాతయాత్ర నిర్వహిస్తున్నామని వివరించారు.
అనంతరం ఈ ప్రచార జాతయాత్ర మండలంలోని వీరరాఘవపూర్, గుంటిపల్లి, ముల్లంపల్లి, మేడపల్లి, తిప్పాపూర్, పల్లి తదితర గ్రామాల మీదుగా కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మండల పార్టీ సహాయ కార్యదర్శి మోష, రాబర్ట్, అమరచింత మండల పార్టీ సభ్యులు భాస్కర్, ఎండి కుతుబ్, రవీందర్, శ్యాంసుందర్, రఘు, సోలు తదితరులు పాల్గొన్నారు,

## పాఠశాలకు రూ.50 వేల విలువైన సౌండ్ సిస్టం అందజేత

**తెలకపల్లి, ఆగస్టు 11 (జనంసాక్షి):**
తెలకపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు 1975-76 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.50 వేల విలువైన సౌండ్ సిస్టంను మంగళవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ సౌండ్ సిస్టంను పాఠశాలకు అందించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.
ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు రేవంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాలస్వామి, ప్రభాకర్, కుమారస్వామి తదితరులు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, పాఠశాల దశ నుంచే మంచి అలవాట్లను అలవరుచుకోవాలని విలువైన సూచనలు చేశారు.
ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు తమ వంతుగా స్టడీ మెటీరియల్‌ను కూడా అందజేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. పాఠశాల



అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు, మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలకు రూ.50 వేల విలువైన సౌండ్ సిస్టంను అందించిన 1975-76 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులకు పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బిఆర్ఎస్ నాయకుల నిరాధరణ ఆరోపణలు మానుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తగోళ్ల కృష్ణయ్య





**ఖిల్లా ఘనపురం,11, ఆగస్టు (జనంసాక్షి):** బిఆర్ఎస్ నాయకుల నిరాధరణ ఆరోపణలు మానుకోవాలి లేదంటే ప్రజలే మీకు బుద్ధి చెబుతారని మంగళవారం స్థానిక పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల అధ్యక్షులు కొత్తగోళ్ల కృష్ణయ్య అన్నారు ఆయన మాట్లాడుతూ నిత్యం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పనిగా పెట్టుకున్నారని రైతులకు నీళ్ళు అందిస్తున్న మా ప్రభుత్వం పై అవగాహన రాహిత్యంగా బి ఆర్ ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టే విధంగా వ్యవహరిస్తున్నారని మా పై మా నాయకులపై దూషణలకు దిగడం వీరి చిల్లర బుద్ధులకు ఇది నిదర్శనంగా ఉంది అని మన నియోజక వర్గానికి జిల్లాకు సంబంధం లేని ఓ యూట్యూబార్ గాడిదతో మా పార్టీ ముఖ్య నాయకులని టార్గెట్ చేసి పాలమూరోడ అని బూతులు తిట్టిపించడం చేస్తున్నారు ఇది మంచి పద్ధతి కాదు మరోసారి ఎలాంటివి పునరావృతం అయితే మా పార్టీ కార్యకర్తల నిజస్వరూపం చూడవలసి వస్తుంది అని అన్నారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకులపై ఆరోపణలు అనుచిత వ్యాఖ్యలు చేసిన సిద్దిపేట అను వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు ఈ కార్యక్రమంలో దిశ కమిటీ జిల్లా సభ్యులు రవి నాయక్,నాయకులు ఆగారం ప్రకాష్,వెంకటం పల్లి సర్పంచ్ ఆంజనేయులు,క్యామ శ్రీరాములు, లచ్చి రెడ్డి,డీలర్ రమేష్, ఒమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### బాలానగర్ మండలంలో

## వర్షానికి రైతుల్లో సంతోషం

- **గౌతపూర్, అమ్మపల్లి సహా 11గ్రామాల్లో పంటలకు ఊరట!**





**బాలానగర్, ఆగస్టు 11(జనంసాక్షి):** బాలానగర్ మండలంలో రాత్రి కురిసిన వర్షాలకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండటంతో వాన కోసం పడిగాపులు కాసిన రైతులకు ఈ వర్షం పెద్ద ఊరటనిచ్చింది. మండలంలోని గౌతపూర్, అమ్మపల్లి, బోడజాణంపేట, అప్పాజీపల్లి, పెద్దారెవెల్లి, చిన్నరెవెల్లి, తిరుమలగిరి, గుండెడ్, నేరళ్లపల్లి, ఉడిత్యాల, పెద్దయిపల్లి గ్రామాల్లో విస్తారంగా మొక్కజొన్న, పత్తి, జొన్నతో పాటు ఇతర పంటలు సాగులో ఉన్నాయి.ఎండల కారణంగా పంటలు వాడిపోతాయేమోనని ఆందోళన చెందిన రైతులు, వర్షం పడడంతో పంటలు మంచిగా వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భూమికి తగిన తడి అందడంతో ఎరువులు, మందులు చల్లేందుకు అనుకూలంగా ఉందని రైతులు తెలిపారు.

వ్యవసాయ అధికారులు కూడా ఈ వర్షాలతో ఖరీఫ్ పంటలకు మేలు జరుగుతుందని అంచనా వేస్తున్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ నూతన వైస్ చైర్మన్ మాల శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 11(జనంసాక్షి);**
జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని దళిత కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన వైస్ చైర్మన్‌గా నియమితులైన మాల శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్రాల దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్, జిల్లాదళిత జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు దాగే పోగు వెంకటన్న, టిడబ్ల్యూజెఎఫ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేష్, సీనియర్ జర్నలిస్ట్ మన్నపురం రాముడు, వేణుగోపాల్ తదితర మిత్రబృందం పాల్గొని మాల శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో మాల శ్రీనివాస్ మరింత సమర్థవంతంగా పనిచేసి దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు లభించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

### కార్మికుల సంక్షేమం

## గాలికి వదిలేసిన యాజమాన్యం






**రాజాపూర్, ఆగస్టు 11(జనంసాక్షి):**
రంగారెడ్డిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని భారత్ పెట్రోలియం బంక్‌లో కార్మికుల సంక్షేమం గాలికి వదిలి యాజమాన్యం మాత్రం, కార్మికుల శ్రమ దోపిడి చేస్తున్నారని , ఈ సంఘటన చూస్తే అర్థం అవుతుంది. రెండు రోజుల క్రితం కార్మికులు ఉద్యోగ సమావేశం నిర్వహించే కార్యాలయంలో , అర్ సిసి కప్పు ఊడిపడి ఫ్యాన్, ఫర్నిచర్ డ్యామేజ్ అయింది. నిత్యం కార్మికులు అదే కార్యాలయంలో రాత్రి వేళల్లో కొంత సమయం సేదా తీరే వరాని, ఆసమయంలో స్లాప్ కూలీ నుంటే కార్మికుల పరిస్థితి ఏమిటి అని చర్చా మొదలవుతుంది. మూడు రోజులు గడిచినా మరమ్మతులు చేపట్టని యాజమాన్యం నిర్లక్ష్యం తగదని పలువురు హెచ్చరిస్తున్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**రాజోలి, ఆగస్టు 11(జనంసాక్షి):** అక్రమ ఇసుక రవాణాపై రాజోలి పోలీసులు నిఘా పెంచారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం మానుదొడ్డి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పాలక్షి రెడ్డి, హోంగార్డు కృష్ణ అనుమానాస్పదంగా ఇసుక తరలిస్తున్న AP39GU1208 నంబర్ గల ట్రాక్టర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ నాయకి వెంకట్రాముడిని విచారించారు. విచారణలో ట్రాక్టర్ యజమాని పెద్ద ధన్వాడ గ్రామానికి చెందిన వీరేష్ అని వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు. కానిస్టేబుల్ పాలక్షి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పాము కాటుకు గురైన

## గురుకుల విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి

- **అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశం**



**దేవరకద్ర, ఆగస్టు 11(జనంసాక్షి):**
పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వైద్య అధికారులను ఆదేశించారు. దేవరకద్రలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థి పాముకాటుకు గురయ్యారు. ప్రస్తుతం ఆ విద్యార్థి మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆసుపత్రిని సందర్శించి విద్యార్థిని పరామర్శించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై, అతనికి అందుతున్న అత్యవసర చికిత్సపై అక్కడి వైద్యులతో సమీక్షించారు.ప్రస్తుతం విద్యార్థి చికిత్సకు సహకరిస్తున్నాడని, ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉందని వైద్యులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ, విద్యార్థిని నిరంతరం నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను, వైద్యులను ఆదేశించారు.

## వనపర్తిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

- **వాహనదారులకు జాతీయ జెండాల పంపిణీ**



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 11(జనంసాక్షి):** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కన్వీనర్ బచ్చు రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ప్రధాన రహదారుల కూడలి వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు జాతీయ త్రివర్ణ పతాకాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ బచ్చు రాము, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబీరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుడ్డన్న, ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బాసెట్టి శ్రీనివాసులు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అలివేలమ్మ, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

- **ఏదుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి**



**రేవల్లి, ఆగస్టు 11(జనంసాక్షి):** బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి హితవు పలికారు. వాకిటి శ్రీధర్ ఇటీవల నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మాట్లాడిన అంశాల్లో వాస్తవాలు లేవని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు మిమ్మల్ని ఓడించిన తర్వాత ఏం మాట్లాడాలో తెలియక, తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తున్నారు. కానీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సుఖేందర్ రెడ్డి విమర్శించారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి గురించి మాట్లాడే ముందు, గతంలో బీఆర్ఎస్ నాయకులు నిరంజన్ రెడ్డి, హరీష్ రావు సభాముఖంగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. అవసరమైతే ఆ వీడియోలను కూడా ప్రజల ముందుకు తీసుకువస్తామని ఆయన హెచ్చరించారు.

**కల్వకుర్తి ఎత్తిపోతలపై వాస్తవాలు:** "ప్రకృతి వైపరీత్యాలను ఎవరూ నియంత్రించలేరు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల శ్రీశైలం జలాశయానికి నీరు వచ్చింది. ఆ నీరు సముద్రంలో కలిసిపోకుండా ప్రభుత్వం జులై 25వ తేదీ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని నింపింది. అనంతరం ఆగస్టు మొదటి వారం నుంచి కాలువల ద్వారా రైతులకు నీటి విడుదల ప్రారంభించింది. ఈ వాస్తవాలు తెలిసినా 'మా వల్లే నీళ్లు వచ్చాయి' అని తప్పుడు ప్రచారం చేయడం రాజకీయ అవకాశవాదం తప్ప మరొకటి కాదని అన్నారు.

**బహిరంగ చర్చకు సిద్ధం:** "వనపర్తి ఎమ్మెల్యే పైనా, ప్రభుత్వంపైనా నిరాధార ఆరోపణలు చేయడం మాని చిల్లర రాజకీయాలకు స్వస్తి చెప్పి వాస్తవాల ఆధారంగా మాట్లాడండి. మీకు నిజంగా ధైర్యం ఉంటే, మీ నాయకుడు నిరంజన్ రెడ్డితో రండి. ఎమ్మెల్యే మేఘా రెడ్డి కూడా వస్తారు. ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు మేము సిద్ధం. నిజం ఎవరి వైపు ఉందో ప్రజలే తీర్పు చెబుతారని పందెం సుఖేందర్ రెడ్డి సవాల్ విసిరారు.

## గుండుమాల్ మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి

- **సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన ప్రజాప్రతినిధులు**



**గుండుమాల్, ఆగస్టు 11(జనంసాక్షి):** గుండుమాల్ మండల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి, వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ గుండుమాల్ మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుండుమాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సుంకిరెడ్డి విక్రమ్‌రెడ్డి రెండోసారి నియమితులైన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మౌలిక వసతుల కొరతతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వినతి పత్రంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ, విద్య, వైద్య సదుపాయాలు తదితర అభివృద్ధి పనులకు తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు.

**శ్రీ దేవర్ బాలాజీ దేవాలయ అభివృద్ధి:** గుండుమాల్ మండల కేంద్రంలోని శ్రీ దేవర్ బాలాజీ దేవాలయాన్ని విస్తరించి అభివృద్ధి చేయడంతో పాటు కళ్యాణ మండపం, భక్తుల సౌకర్యార్థం గదులు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

**మల్టీపర్పస్ కన్వెన్షన్ హాల్:** మండల కేంద్రంలో సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రజా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మల్టీపర్పస్ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గుండుమాల్ మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ఇంటిగ్రేటెడ్ వెహికల్ అండ్ నాన్-వెహికల్ మార్కెట్ భవనం నిర్మాణం లాంటి మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కోరారు.

**ముదిరెడ్డిపల్లి ఆలయ నిర్మాణం:** ముదిరెడ్డిపల్లి గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి వినతి చేశారు. గుండుమాల్ మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన నిధులు మంజూరు చేస్తే ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని వారు తెలిపారు. మండలంలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, కొత్తగా అవసరమైన పనులకు కూడా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి సురేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకిరెడ్డి విక్రమ్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు బద్రిగారి రవి, గ్రామ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్




నవాబ్‌పేట, ఆగస్టు 11(జనంసాక్షి): విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన అదనపు కలెక్టర్ శ్రీ డి. మధుసూదన్ నాయక్ నవాబ్‌పేట, ఆగస్టు 11 మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) పాఠశాలను మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీ డి. మధుసూదన్ నాయక్, ఐఏఎస్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలలను మరియు విద్యార్థుల వసతులను నిశితంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కింద కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం యొక్క నాణ్యతను రుచి చూసి పరిశీలించిన ఆయన, విద్యార్థులకు నిబంధనల ప్రకారం మెరుగైన వసతులు, పౌష్టికాహారం మరియు నాణ్యమైన విద్యను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నవాబ్‌పేట గ్రామంలో ప్రస్తుతం సాగుతున్న పలు ప్రభుత్వ ప్రగతి పనులను ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి, పనుల పురోగతిని సమీక్షించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, జరుగుతున్న పనులను త్వరితగతిన మరియు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (CEO ZPP), నవాబ్‌పేట మండల విద్యాధికారి (MEO), నవాబ్‌పేట గ్రామ పంచాయతీ సర్పంచ్, క్షేత్రస్థాయి అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చేర్యాలలో ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

- ప్రధాని మోడీ పిలుపు మేరకు జాతీయ జెండాల పంపిణీ



చేర్యాల, ఆగస్టు11(జనంసాక్షి): భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' యాత్రలో భాగంగా చేర్యాల పట్టణ కేంద్రంలో మంగళవారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పోతుగంటి రామదాసు, గుర్జకుంట సర్పంచ్ కాసెట్టి పండు,పుర్మ సంజీవరెడ్డి, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఫంగ సిద్ధులు, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కాటం సురేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి మనిషి, ఎండి షాదుల్లా, ఔషర్ల నరసింహులు, గుడ్ల అంజయ్య, ఆకుల శివయ్య, బిట్ల వెంకట్, బింగి శ్రీనివాస్, ఇప్పకాయల సత్యనారాయణ, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇక్రిశాట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఊరట

- ఎమ్మెల్సీ చొరవతో వేతనాల పెంపు.. 18 సెలవులు



రామచంద్రపురం,ఆగస్టు 11(జనంసాక్షి): ఇక్రిశాట్‌లో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న సుమారు 300 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఊరట లభించింది. ఎమ్మెల్సీ అంజిరెడ్డి చొరవతో నెలవారీ ఉద్యోగులకు నెలకు రూ.1,500, దినసరి ఉద్యోగులకు రోజుకు రూ.50 చొప్పున వేతనం పెంచడంతో పాటు ఏడాదికి 18 సెలవులు మంజూరు చేయనున్నారు. సమస్య పరిష్కారం కావడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరికి కృతజ్ఞతలు తెలిపేందుకు మంగళవారం రామచంద్రపురంలోని ఎమ్మెల్సీ నివాసానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సన్మానించారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



పాపన్నపేట, ఆగస్టు 11 (జనంసాక్షి): రోడ్డు ప్రమాదంలో సోమవారం మరణించిన పాపన్నపేట గ్రామానికి చెందిన ఆకుల కృష్ణ గ్రామ పంచాయతీ కారోబార్ అంత్యక్రియలు మంగళవారం పాపన్నపేటలో జరిగాయి. ఈ అంత్యక్రియల్లో మెదక్ మాజీ ఎమ్మెల్యే, భారాస జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మెదక్ మాజీ ఎమ్మెల్యే,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంత రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేల వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,భారాస మండలాధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, గురుమూర్తి గౌడ్ తదితరులు ఉన్నారు.

## అవసరం లేని సమయంలో డీ-8 కాలువపై స్లాబ్ నిర్మాణం.. రైతుల ఆందోళన



గోపాలపేట, ఆగస్టు 11(జనంసాక్షి): గోపాలపేట మండలంలోని డీ-8 కాలువ 2.3 కిలోమీటర్ల వద్ద ప్రస్తుతం అవసరం లేకపోయినా స్లాబ్ నిర్మాణ పనులు చేపట్టడంపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పనులు ఎండాకాలంలో నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుతం కాలువకు నీరు విడుదల చేసే సమయంలో చేపట్టడం వల్ల సాగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితమే రైతులు పనులు నిలిపివేయాలని, స్లాబ్ నిర్మించవద్దని కాంట్రాక్టర్లకు విజ్ఞప్తి చేసినప్పటికీ వారు పట్టించుకోకుండా పనులు కొనసాగించారని ఆరోపించారు. ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రైతుల సమస్యను పరిష్కరించాలని రైతుల తరఫున గోపాలపేట మండల రైతుబంధు అధ్యక్షుడు తిరుపతి యాదవ్, చకల్‌పల్లి సర్పంచ్ శేషిరెడ్డి చంద్రశేఖర్, రాజేష్ గౌడ్, మన్యం నాయక్, ఉపసర్పంచ్ కేశవులు, మనీష్ బాబు, మూర్తి, జహంగీర్, వర్రీ రాజు తదితరులు కోరారు.

## సన్న వరి రైతులకు రూ.500 బోనస్

- 17లోగా ప్రొఫార్మా సమర్పించాలి



ఉప్పునుంతల, జనం సాక్షి: ఖరీఫ్-2026లో ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న వరి రకాలను సాగు చేస్తున్న అర్హులైన రైతులకు వరి కొనుగోలు అనంతరం కనీస మద్దతు ధర (MSP)తో పాటు ఎకరానికి రూ.500 బోనస్ అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ తెలిపారు. BPT-5204 (సాంబా మసూరి), RN=-15048 (తెలంగాణ సోనా), HMT సోనా, WGL-44 (సిద్ధి), KNM-1638, KNM-7715, జై శ్రీరామ్ రకాలను ప్రభుత్వం గుర్తించినట్లు పేర్కొన్నారు. బోనస్ పొందేందుకు అర్హులైన రైతులు ఆగస్టు 17లోగా ప్రొఫార్మా సమర్పించాలి. ప్రొఫార్మాతో పాటు పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్, విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ ఇచ్చిన బిల్లు జిరాక్స్ కాపీని తప్పనిసరిగా జత చేయాలని సూచించారు. రైతులు తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) లేదా మండల వ్యవసాయ అధికారి (MAO)ను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు

## జడ్చర్ల, కావేరమ్మపేటలలో జోరుగా సంతకాల సేకరణ



జడ్చర్ల, ఆగస్టు 11(జనంసాక్షి): కావేరమ్మపేట మున్సిపల్ వార్డు భవనంలో జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం విజయవంతంగా చేపట్టారు. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సాధన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కావేరమ్మపేట మునిసిపల్ వార్డు భవనం వద్ద సంతకాల సేకరణను ప్రారంభించి, కావేరమ్మపేట, జడ్చర్ల ప్రాంతాల్లోని దుకాణ సముదాయాలలో, ప్రధాన వీధులు, కూడళ్లలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో జడ్చర్ల, కావేరమ్మపేటలకు చెందిన ప్రజా ప్రతినిధులు, మేధావులు, పుర ప్రముఖులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, వ్యాపారులు, యువకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు కదిలివచ్చి ఉద్యమ స్ఫూర్తిని చాటారు. ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించడంతో సంతకాల సేకరణ విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## చేర్యాలకు చేరుకున్న గీతన్నల చైతన్య యాత్ర




చేర్యాల, ఆగస్టు 11(జనంసాక్షి): కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం. వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం బస్సు యాత్ర చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో ప్రారంభం జరిగి చేర్యాల పట్టణంలో జాతీయ రహదారిపై కల్లు గీత కార్మికులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సెంటర్ వద్ద ర్యాలీనీ ఉద్దేశించి కేజికెఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.విరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గీత కార్మికులకు పెన్షన్ 4 వేలకు పెంచుతామని, ఎక్సిగ్రేషియా 10 లక్షలు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నెల రోజుల లోపే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చెప్పారు. కానీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని, వృత్తిలో ప్రమాదాలు జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్సిగ్రేషియా 20 కోట్ల రూపాయలు అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినప్పటికీ ఇవ్వలేదు, 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కొత్తగా ఎవరి దరఖాస్తులు స్వీకరించడం లేదని అన్నారు. మేము కొత్తగా కోరికలు ఏమి కోరడం లేదని మీరిచ్చిన వాగ్దానాలే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నమని తెలిపారు. వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం ఇస్తుందన్నారు. రాష్ట్రంలో సభ్యత్వం కలిగిన వాళ్లు 2 లక్షల 30 వేల మంది ఉండగా కేవలం 30 వేల మందికే ఇచ్చారని అన్నారు. వృత్తి చేసే వారందరికీ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తాటి ఈత చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాలు చొప్పున భూమి ఇవ్వాలని, నీరా తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు. నందనములోని నీరా ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో నీరాకు కేటాయించిన 25 కోట్లు, సంక్షేమానికి కేటాయించిన 67 కోట్లు వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలన్నారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కారం కై ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 18 వరకు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాత్ర బృందం బూడిదగోపి, బాల్నే వెంకట మల్లయ్య, గౌని వెంకన్న, భీమగోని చంద్రయ్య, పామనుగుళ్ల అచ్చాలు, కొండం కరుణాకర్, కుర్ర ఉప్పలయ్య, బండకింది బాల్ నారాయణ,మొక్క నాగేశ్వరరావు, బుర్ర సుధాకర్, పాలకూరి జగన్, సురుగు రాజేష్ గౌడ్, హనుమాండ్ల కాడి నవీన్, 7వ వార్డు కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు అనగొని నర్సింహులు, ఆకుల కనకయ్య, కోల సత్తయ్య, గుడాల గణేష్, పచ్చిమడ్ల రాములు, బండకింది క్రాంతి, బండకింది సురేష్, చేర్యాల సొసైటి అధ్యక్షులు పచ్చిమడ్ల సిద్దిరాములు, మాజీ సొసైటీ అధ్యక్షులు అంబాల రాములు, తాళ్లపల్లి నర్సింహులు, వడ్లకొండ సంజీవులు, బూడిద అంజయ్య, వడ్లకొండ వెంకటేష్,బూరుగు సురేష్,పరిశరాములు, కూరెల్ల మల్లేశం, నాచగోని శ్రీనివాస్ వివిధ గ్రామాల సొసైటి అధ్యక్షులు, కల్లు గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి చేయూత పెన్షన్లు దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరగాలి

- చేయూత పెన్షన్ల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి):** ప్రభుత్వం నూతనంగా అందించే 7 రకాల చేయూత పెన్షన్లకు అర్హులైన వారి దరఖాస్తుల స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశం చారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరం నుంచి జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, మండల స్పెషల్ అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ నెల 15 నుంచి నూతనంగా ఇచ్చే చేయూత పెన్షన్ల కోసం దరఖాస్తు లను పరిశీలించి, అర్హులైన వారిని గుర్తించాలని, ప్రజా ప్రతినిధుల నుంచి, ప్రజావాణి కార్యక్రమంలో పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను తక్షణమే ఎంట్రీ చేయాలన్నారు. చేయూత పెన్షన్ల దరఖాస్తుల కోసం హెల్ప్ డెస్క్ నెంబర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఎంపిడిఓ కార్యాలయం, మున్సిపల్ ఆఫీస్ వద్ద చేయూత పెన్షన్ల కోసం ప్రజలకు అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధాప్య పింఛన్లు, బీడీ కార్మికుల పెన్షన్లు మినహాయించి మిగతా పెన్షన్ల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు.

వృద్ధాప్య, బీడీ కార్మికుల పింఛన్లపై ప్రభుత్వం అనుమతించిన తర్వాత వాటిని పరిష్కరించాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వ యంతో చేయూత పెన్షన్ల దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా అధికారులు తాహసిల్దార్లు,ఎంపీడీవోలు, మం డల ప్రత్యేక అధికారులు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన జీపీఎస్ లైవ్ బస్ ట్రాకింగ్

- జడ్చర్ల బస్టాండ్ కంట్రోలర్ జయప్రకాష్






**జడ్చర్ల, ఆగస్టు 11 (జనంసాక్షి):** ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జడ్చర్ల బస్టాండ్‌లో జీపీఎస్ లైవ్ బస్ ట్రాకింగ్‌ను ప్రయోగాత్మకంగా మంగళవారం ప్రారంభించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ బస్టాండ్‌లో రోజూ దాదాపు 1 వెయ్యి దాకా బస్సులు రాకపోకలు సాగిస్తుండటంతో ఆర్టీసీ ఈ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు కంట్రోలర్ జయప్రకాష్ తెలిపారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్లపై బస్సుల ప్రస్తుత స్థానం, గమ్యస్థానానికి చేరుకునే సమయం, బస్సు నంబర్, వెళ్లే మార్గం మరియు ప్లాట్‌ఫాం వివరాలను స్పష్టంగా ప్రదర్శిస్తున్నారు. డిజిటల్ స్క్రీన్లతో పాటు మైక్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రయాణికులకు ఆడియో అనౌన్స్‌మెంట్లు కూడా అందిస్తున్నారు. ఈ ఆధునిక వ్యవస్థ అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు బస్సుల రాకపోకల సమాచారాన్ని సులభంగా తెలుసుకుంటూ సమయాన్ని ఆదా చేసుకునే అవకాశం లభించిందని, ప్రయాణికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## హెచ్‌ఐవీ పరీక్షలకు డిజిటల్ విధానం

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సమీపంలోని హెచ్‌ఐవీ పరీక్షా కేంద్రాలు, అందుబాటులో ఉన్న సేవలు తదితర వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందనీ, హెచ్‌ఐవీపై అనుమానం ఉన్న వారు భయపడకుండా, గోప్యతకు భంగం కలగకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్‌ఐవీని ముందుగా గుర్తించడం ద్వారా అవసరమైన వైద్య సేవలు, చికిత్సను సకాలంలో పొందే అవ కాశం ఉంటుందనీ ,ప్రజలు అపోహలకు గురికాకుండా హెచ్‌ఐవీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని, అవసరమైన వారు సమీపం లోని ఐసీటీసీ/హెచ్‌ఐవీ పరీక్షా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. "హెచ్‌ఐవీపై అవగాహన - సకాలంలో పరీక్ష - ఆరోగ్యకరమైన సమాజం" అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్ ,డాక్టర్ హరి ప్రసాద్ , ఐసిటిసి కౌన్సిలర్ ధనశ్రీ , గోపి సుధాకర్, రవి పీఎంవో శంకర్ రాథోడ్, కామిని రాజేశ్వర్ , స్కోప్ ఎన్జీవో ఉప్పలయ్య. అనిల్ ,లింక్ వర్కర్ ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్ ,స్టాఫ్ నర్స్ సౌందర్య, అంజిరెడ్డి ఎజూవి శ్రీనివాస్ అకౌంటెంట్ రమేష్ పాల్గొన్నారు.

## దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్ఎస్‌సిలో చేరేందుకు ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాల వయ స్సు నిండిన వారు అర్హులని, ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదన్నారు. ఇంటర్‌కు సంబంధించి ఆగస్టు 31 నాటికి 15 సంవత్సరాల వయస్సు నుండి ఉండాలన్నారు. గుర్తింపు పొందిన బోర్డు నుండి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని లేదా ఇతర బోర్డులలో ఇంటర్ ఫెయిల్ అయిన వారు కూడా అర్హులని తెలిపారు. రెండింటికి గరిష్ట వయో పరిమితి లేదన్నారు. టాస్ ద్వారా ఉత్తీర్ణులైన విద్యార్థులు వివిధ విశ్వవిద్యాలయాల ద్వారా ఉన్నత చదువులకు అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి గల వారందరూ మరిన్ని వివరాలకు తమ సమీపంలోని దూర విద్య కేంద్రం సమన్వయకర్తను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సంబంధిత వెబ్సైట్ ద్వారా ఈనెల 17వ తేదీలోగా, జరిమానాతో ఈనెల 29వ తేదీ వరకు ఆన్లైన్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, టాస్ జిల్లా కోఆర్డినేటర్ సునీతమ్మ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్‌లో నూతన బస్టాండ్ నిర్మాణానికి మంత్రి హామీ



**ఆత్మకూర్, ఆగస్టు 11(జనంసాక్షి):** ఆత్మకూర్‌లో నూతన బస్టాండ్ నిర్మాణానికి గౌరవ తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి సానుకూలంగా స్పందించారు.నూతన బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో గౌరవ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే సానుకూలంగా స్పందించి, నూతన బస్టాండ్ నిర్మాణానికి అతి త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, ఆత్మకూర్ ప్రజల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మాణం తప్పనిసరి అని, ప్రభుత్వం నుంచి త్వరలో నిధులు తెప్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.డి. రహమతుల్లా, ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అక్షర మహేష్, కాంగ్రెస్ నాయకులు గద్దం శ్రీను, దామోదర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పాటిగడ్డ తండాలో గ్రామసభ..
## అభివృద్ధి ప్రణాళికపై విస్తృత చర్చ



**గోపాలపేట, ఆగస్టు 11(జనంసాక్షి):** గోపాలపేట మండలం పాటిగడ్డ తండాలో గ్రామ సర్పంచ్ ఉషా హర్యా నాయక్ అధ్యక్షతన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2026-27 రూపకల్పనలో భాగంగా తొలి గ్రామసభ నిర్వహించారు.

గ్రామపంచాయతీ అంచనా బడ్జెట్ తయారీ విధా నాన్ని గ్రామ కార్యదర్శి మౌనిక వివరించారు. సమావేశంలో గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, ఆరోగ్యం, విద్య తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుని కి చేరేలా కృషి చేయడంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రజాప్రతినిధులు కోరారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రజని రాందాస్, మాజీ ఎంపీటీసీ పుల్యా నాయక్, రాజేందర్, హన్మ్యా నాయక్, వార్డు సభ్యులు, ఆశా వర్కర్, అంగన్‌వాడీ టీచర్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అబద్ధాలు చెప్పడంలో జగ్గారెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలి

- జగ్గారెడ్డి ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారు
- సంగారెడ్డిలో మళ్లీ గెలిచే పరిస్థితి లేదు
- జగ్గారెడ్డి పై విమర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి, ఆగస్టు 11 (జనంసాక్షి):** టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని, అబద్ధాలు చెప్పడంలో ఆయనకు ఆస్కార్ అవార్డు ఇచ్చినా తక్కువేనని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విమర్శించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల క్రితం జరిగిన విషయాలను ఇప్పటికీ పదేపదే ప్రస్తావించడం జగ్గారెడ్డి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని చింత ప్రభాకర్ అన్నారు. గతంలో జరిగిన సమావేశాలు, సంఘటనలను పదేపదే చెప్పుకోవడం మానుకోవాలని సూచించారు. రాహుల్ గాంధీ సభ కోసం రూ.6.5 కోట్లు అప్పు తెచ్చానని జగ్గారెడ్డి చెబుతున్నారని, తాను ఎన్ని కోట్లు అప్పు తెచ్చానన్నది ప్రజలకు ఎందుకు సంబంధమని ప్రశ్నించారు. పార్టీ పెద్దల మెప్పు పొందేందుకే అప్పుల కథలు చెబుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి సంగారెడ్డికి వచ్చిన సమయం లో ప్రభుత్వ హోదా లేని జగ్గారెడ్డికి, ఆయన భార్యకు సీఎం వేదికపై చోటు దక్కకపోవడంతో ఏర్పడిన అసంతృప్తిని హరీష్ రావుపై విమర్శల రూపంలో వ్యక్తం చేస్తున్నారని చింత ప్రభాకర్ ఆరోపించారు.

**పాస్‌పోర్ట్ కేసులో హరీష్ రావుకు సంబంధం లేదు...**

పాస్‌పోర్ట్ బ్రోకర్ కేసులో హరీష్ రావుకు ఎలాంటి సంబంధం లేదని చింత ప్రభాకర్ స్పష్టం చేశారు. మానవ అక్రమ రవాణా కేసు దర్యాప్తులో ఆధారాలు లభించడంతో చట్టపరమైన ప్రక్రియలో భాగంగానే కేసు నమోదైందని తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలను ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేయవద్దని జగ్గారెడ్డికి సూచించారు.

జగ్గారెడ్డి సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో అవినీతి జరిగిందని, పలువురు అధికారులు సస్పెండ్ అయ్యారని, కొందరు జైలుకు వెళ్లారని చింత ప్రభాకర్ ఆరోపించారు. అలాంటి పరిస్థితుల్లో తన నిజాయితీ, పోలీసుల విచారణ గురించి జగ్గారెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు.

**మెడికల్ కాలేజీపై తప్పుడు ప్రచారం...**

సంగారెడ్డి మెడికల్ కాలేజీ విషయంలో కూడా జగ్గారెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని చింత ప్రభాకర్ విమర్శించారు. కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తాను ఫైల్ పెట్టానని జగ్గారెడ్డి చెబుతున్నారని, అలాంటప్పుడు అప్పుడే మెడికల్ కాలేజీ ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు.

**తెలంగాణ ఉద్యమంలో జగ్గారెడ్డి వైఖరిపై విమర్శలు...**

తెలంగాణ ఉద్యమ సమయంలో జగ్గారెడ్డి వ్యవహరించిన తీరును కూడా చింత ప్రభాకర్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో సమైక్యవాదానికి మద్దతుగా నిలిచిన వ్యక్తి ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్, హరీష్ రావు తెలంగాణ కోసం పోరాడుతుంటే జగ్గారెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరించారని ఆరోపించారు.

సంగారెడ్డి గడ్డపై ఎన్ని రాజకీయ కార్యక్రమాలు నిర్వహించినా తిరిగి గెలిచే పరిస్థితి లేదన్నారు. చిల్లర రాజకీయాలు మానుకుని సంగారెడ్డి అభివృద్ధిపై చర్చకు రావాలని జగ్గారెడ్డికి సవాల్ విసిరారు. పదవుల కోసం విమర్శలు చేయడం మానుకుని ప్రజల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.

**సమావేశంలో కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ...** ఎమ్మెల్యేగా గెలవకముందు జగ్గారెడ్డి అనేక హామీలు ఇచ్చారని విమర్శించారు. గల్లీకో ఏటీఎం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ప్రభుత్వం లేదని చెప్పారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మనోహర్ గౌడ్, కొండల్ రెడ్డి, కౌన్సిలర్లు పొన్న రాజేందర్ రెడ్డి, లాడే మల్లేశం, జాఫర్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

- భావితరాలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందిద్దాం
- వన మహోత్సవంలో మొక్కలు నాటిన జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు



**మెదక్ బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పరిశుభ్రత, పచ్చదనం, సమతుల్యమైన మరియు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కాపాడటంలో మొక్కలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు.నేటి మొక్కలే రేపటి మహావృక్షాలు అని పేర్కొన్న ఎస్పీ.. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, అవి ఎదిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ. విక్రాంత్ కుమార్ సింగ్, సీఐ లు మహేష్, జర్జ్, రాజశేఖర్ రెడ్డి సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఆర్ఐ లు శైలందర్, రామ కృష్ణ, ఎసై లు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఎన్మన్‌గండ్ల గ్రామ పంచాయతీ

# కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ

- తనిఖీ చేసిన జిల్లా పరిషత్ సీఈఓ, ఎంపీడీఓ



**నవాబ్‌పేట, ఆగస్టు 11(జనంసాక్షి):** మండల పరిధిలోని ఎన్మన్‌గండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (CEO ZPP) మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, క్షేత్ర స్థాయిలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమం నవాబ్‌పేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (MPDO) శ్రీ జయరాములు గారితో కలిసి సంయుక్తంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా వారు గ్రామ పంచాయతీకి సంబంధించిన కార్యాలయ రికార్డులను, వివిధ నిధుల వ్యయాలకు సంబంధించిన రిజిస్టర్లను నిశితంగా పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు, పన్నుల వసూళ్లు మరియు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉందో లేదో సరిచూశారు. కార్యాలయ రికార్డులను నిరంతరం అప్‌డేట్ చేస్తూ, పారదర్శకమైన పరిపాలన అందించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా, ప్రతీ పైసా గ్రామాభివృద్ధికి సద్వినియోగం అయ్యేలా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.

## జాతీయ నినాదాలతో మార్మోగిన రామాయంపేట

- 500 అడుగుల జాతీయ జెండాతో ఘనంగా తిరంగా యాత్ర
- యువతలో దేశభక్తి స్ఫూర్తి నింపిన తిరంగా యాత్ర
- దేశభక్తి నినాదాలతో హోరెత్తిన పట్టణం



**రామాయంపేట,ఆగస్టు 11 (జనంసాక్షి):** హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ రామాయంపేట పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భారీ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల నుంచి ప్రారంభమైన యాత్ర ప్రధాన పురవీధుల మీదుగా కొనసాగింది. 800 విద్యార్థులు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని 500 అడుగుల భారీ జాతీయ జెండాను చేతబట్టి జాతీయ నినాదాలతో ముందుకు సాగారు. దీంతో రామాయంపేట పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. ర్యాలీలో పాల్గొన్న వారు 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' వంటి నినాదాలతో హోరెత్తించారు. సిద్దిపేట చౌరస్తాలోని స్వామి వివేకానంద విగ్రహానికి, అనంతరం రామాయంపేట చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ ఐక్యత, సమైక్యతను చాటుతూ యాత్ర కొనసాగింది.

# అవంచ పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- గర్భిణీల నెలవారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్







**నాగర్‌కర్నూల్, ఆగస్టు 11(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ తిమ్మాజీపేట మండలంలోని అవంచ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మందుల లభ్యత తదితర అంశాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రానికి ఏఎంసి వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణీలతో కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను, గర్భిణీలకు నిర్వహిస్తున్న నెలవారీ ఏఎంసీ పరీక్షల వివరాలు, ఇప్పటివరకు నిర్వహించిన వైద్య పరీక్షలు, ఆరోగ్య నివేదికలు, వారికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య పరీక్షలు, మందులు, సూచనలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే చికిత్స కోసం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన బాలికతో కలెక్టర్ మాట్లాడి ఆమెకు ఉన్న ఆరోగ్య సమస్యల వివరాలను బాలిక తల్లి తో అడిగి తెలుసుకున్నారు. ఆమెకు అందిస్తున్న చికిత్స, వైద్యుల సూచనలు, అవసరమైన మందుల వివరాలపై సంబంధిత వైద్యులను ప్రశ్నించారు. రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగి పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని అవసరమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందులు, వినియోగిస్తున్న మందులు, అత్యవసర మందుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత ఏర్పడకుండా ముందస్తుగా అవసరాలను గుర్తించి సంబంధిత అధికారులకు నివేదించి అవసరమైన మందులను తెప్పించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో రోజువారీగా నిర్వహిస్తున్న ఓపీ వివరాలు, వైద్య సేవలు పొందుతున్న రోగుల సంఖ్య, అందిస్తున్న చికిత్స తదితర వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని, ప్రతిరోజూ అందుతున్న వైద్య సేవలకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు కీలకమైన వైద్య సేవల కేంద్రాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అవసరమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సీతాఫలం ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**మహిళా సంఘాల కార్యకలాపాలపై ఆరా...**

అనంతరం మండలంలోని స్వయం సహాయక సంఘాల నిర్వహణ, బ్యాంకు రుణాలు,ఎన్‌పీఏ, కిశోర బాలికల సంఘాల ఏర్పా టు, వీఓ భవనాల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసు కున్నారు.మండలంలో నిర్మాణంలో ఉన్న వీఓ భవనాలను మరో 20 రోజుల్లోపు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే 'మై వన్' సాంకేతికతను విని యోగించి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచిం చారు.

**వీఓ భవన నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్...**

చివరగా మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో కొనసాగుతున్న వీఓ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనులను త్వరితగతిన పూర్తిచేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ వెంకట్ రాములు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, ఎంపీడీవో సాయి లక్ష్మీ, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు మేలు

- జిల్లా వ్యవసాయ అధికారి ఎం. సక్రియ నాయక్
- FSS App ద్వారా ఎరువులు ముందస్తుగా బుక్ చేసుకోవాలి
- ప్రభుత్వ నిర్దేశిత ధరలకే కొనుగోలు చేయాలి



**మాగనూర్, ఆగస్టు 11(జనంసాక్షి):**

ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం. సక్రియ నాయక్ సూచించారు.

మాగనూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి ఎం. సక్రియ నాయక్ హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా అలాగే రైతులు ఆయిల్ పామ్ సాగుపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ ఉత్పత్తులను ప్రభుత్వం నోటిఫై చేసిన ధరల ప్రకారం కొనుగోలు చేయడంతో పాటు, రైతులకు సంబంధించిన చెల్లింపులను త్వరితగతిన వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు ఉంటాయని తెలిపారు.

ఖీూాాజూజూ ద్వారా ఎరువుల బుకింగ్

రాబోయే రెండు రోజుల్లో రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న FSS (Framework for Fertilizer Sales) App ద్వారా తమకు అవసరమైన ఎరువులను ముందస్తుగా బుక్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే కొనుగోలు చేయాలని, అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు. ఎరువుల లభ్యత, పంపిణీ విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం

అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మాగనూర్ రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని అధికారులు సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్, ాజుూాలు పవన్, రాధికతో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో 20 ప్రైవేట్ ఆసుపత్రుల్లో తనిఖీలు

- నిబంధనల అమలు, రికార్డుల నిర్వహణ, వైద్య సేవలపై అధికారుల పరిశీలన
- నిబంధనలు పాటించని మూడు ఆసుపత్రులకు నోటీసులు..
- రిన్యూవల్ లేకుండా నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్లినిక్ మూసివేత
- జిల్లా వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శశాంక్



**సంగారెడ్డి, ఆగస్టు 11 (జనంసాక్షి):** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య సంస్థలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి ఆదేశాల మేరకు సంగారెడ్డి పట్టణంలో మంగళవారం వివిధ ప్రైవేట్ ఆసుపత్రిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన వివిధ ప్రోగ్రాం అధికారుల డాక్టర్ శశాంక్ అధికారులతో కలిసి సంగారెడ్డి పట్టణ పరిధిలోని 20 ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య సంస్థలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో ప్రభుత్వ నిబంధనల అమలు, వైద్య సేవల నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

తనిఖీల సందర్భంగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ లేని మూడు ఆసుపత్రులకు వివిధ కారణాలతో నోటీసులు జారీ చేశారు. ఆసుపత్రుల నిర్వహణలో లోపాలు, నిబంధనల అమలు తీరుపై అధికారులు వివరాలు సేకరించారు.

అదేవిధంగా సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి ప్రాంతంలో మెహర్ ఫిజియోథెరపీ క్లినిక్‌ను అధికారులు తనిఖీ చేశారు. క్లినిక్ రిన్యూవల్ చేసుకోకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించడంతో నిబంధనల ప్రకారం క్లినిక్‌ను మూసివేశారు.

# సెప్టెంబర్ 30లోగా పాఠశాలల మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- మరుగుదొడ్డి లేని పాఠశాల ఉండకూడదు.. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి):** జిల్లాలో మరుగుదొడ్డి లేని ప్రభుత్వ పాఠశాల ఉండకూడదని, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న అన్ని మరుగుదొడ్డి పనులను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ముఖ్య ప్రణాళిక అధికారి, జడ్పీ సీఈఓ, విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ శాఖ అధికారులతో జిల్లాలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పెబ్బేరు మండలానికి గవర్నర్ నిధుల నుంచి మంజూరైన రూ.15 లక్షలతో చేపట్టాల్సిన అదనపు తరగతి గదుల నిర్మాణం, నాలుగు బోర్ల ఏర్పాటు పనులు ఇంకా ప్రారంభించకపోవడానికి కారణాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరైన వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

**133 గ్రామ పంచాయతీ భవనాలపై ప్రత్యేక దృష్టి...**

జిల్లాలో మంజూరైన 133 గ్రామ పంచాయతీ భవనాల్లో ప్రస్తుతం ప్రగతిలో ఉన్న 53 భవనాల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరాశక్తి భవనం నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా జిల్లాలో మంజూరైన 33 ఫుడ్‌గ్రెయిన్ స్టోరేజ్ భవనాలను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సహాయ ఇంజనీర్లు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించాలని, పనుల ఫోటోలను తనకు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ భవనాలు, వీఓ భవనాల నిర్మాణాలను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీఎంఎఫ్‌టీ నిధులతో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని, స్థల సమస్యలు ఎక్కడైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా జిల్లాలో అత్యధిక సంఖ్యలో పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈఓ యాదయ్య, పంచాయతీ రాజ్ ఈఈ విజయ్‌కుమార్, పీడీ డీఆర్‌డీఓ ఇన్‌చార్జి రామ మహేశ్వర్‌రెడ్డి, సీపీఓ హరికృష్ణ, డీడబ్ల్యూఓ సుధారాణి, పంచాయతీ రాజ్ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్బందులను పట్టించుకోని అధికారులు..



**అమీన్పూర్, ఆగస్టు 11(జనంసాక్షి):** చిన్నపాటి వర్షానికి ప్రజలకు ఇబ్బందిగా మారిన భ్రమరాంబిక నగర్ కాలనీ సీసీ రోడ్లను పునర్నిర్మాణం చేయాలని సిపిఎం నాయకుడు నాయిని నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గుంతలకు రోడ్లకు పునః నిర్మాణం చేయాలని సిపిఎం అమీన్పూర్ కమిటీ ఆధ్వర్యంలో శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్ భ్రమరాంబిక నగర్ కాలనీ లో గత 24ఏళ్ల క్రితం వేసిన రోడ్డు తప్ప ఇప్పటికి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. డ్రైనేజీ,మంచినీటి పైపుల సమస్యలతో పలుమార్లు రోడ్లను తవ్విన అధికారులు పునర్నిర్మాణం చేయడం మరిచిపోయారన్నారు. పూర్తిగా గుంతల మయమైన రోడ్డు చిన్నపాటి వర్షానికి డ్రైనేజీ, మురికి నీరు చేరి చెత్త చేదారం తో తో దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అనేక మార్లు అధికారులకు తెలియజేసిన పరిశీలించారు తప్ప పనులు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు కాలనీలో పర్యటించి సిసి రోడ్ల పరిస్థితిని పునరు పరిశీలించి తగిన నిధులు కేటాయించి రోడ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వీరస్వామి, శ్రీనివాస్ రెడ్డి,జిలాని పురుషోత్తం రెడ్డి, విజయనారాయణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు ఐదు లక్షల గ్రూప్ ప్రమాద బీమా

- నారాయణపేట జిల్లాలో 12,000 మత్స్యకారులకు లబ్ధి
- జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కాంత్ కుమార్



**నారాయణపేట, ఆగస్టు 11(జనంసాక్షి):** 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో నారాయణపేట జిల్లాలో 12,000 మంది మత్స్యకారులకు ప్రమాద గ్రూప్ భీమ అమలవుతుందని మత్స్యకారుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రమాద బీమా పట్ల జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కాంత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు..జిల్లాలో 12,000 మంది జిల్లా మాత్స్య కారులు సభ్యత్వ నమోదు కలిగి ఉన్నారని వారందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ప్రమాద బీమా వర్తిస్తుందని ఆయన తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రమాద సమయంలో అండగా నిలవడంతో పాటు,వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా గ్రూప్ ప్రమాద బీమా పథకం కీలకమైనదని పేర్కొన్నారు.ప్రమాద బీమా అమలు చేసినందుకు ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి,నారాయణ పేట ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణిక రెడ్డి రాష్ట్ర మత్స్యకారుల తరపున కృతజ్ఞతా భావంతో అభినందనలు తెలుపుతూ మత్స్యకారులు, వారి కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత, ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయనతెలిపారు.

# ఎల్‌నినో ప్రభావం వలన రైతులు ఆరుతడి పంటలు పండించాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి





**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 11(జనంసాక్షి):** ఎల్‌నినో వర్షాభావ పరిస్థితులలో జిల్లా రైతులు ఆరుతడి పంటలను పండించాలని జిల్లా నీటిపారుదల సలహా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనం శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గజ్వేల్ సర్కిల్ చీఫ్ ఇంజనీర్ శివధర్మతేజ జిల్లాలో గల అన్నపూర్ణ సాగర్ 3.50 టీఎంసీలకు గాను 1.51 టీఎంసీల నీరు ఉందని వాటిలో 0.32 డెత్ స్టోరేజ్ పోను 1.19 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, రంగనాయక సాగర్ 3.00 టీఎంసీలకు గాను 0.99 టీఎంసీ నీరు ఉందని వాటిలో డెత్ స్టోరేజ్ 0.17 టీఎంసీలు పోను. 0.82 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, మల్లన్న సాగర్ 50 టీఎంసీలకు గాను 13.86 టీఎంసీల నీరు ఉందని దానిలో 9.37 టీఎంసీల నీరు డెత్ స్టోరేజ్ పోను 4.12 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, కొండపోచమ్మ సాగర్ టీఎంసీలకు గాను 15.00 టీఎంసీలకు గాను 6.31 టీఎంసీల నీరు ఉందని దానిలో 2.20 టీఎంసీల నీరు డెత్ స్టోరేజ్ పోను 4.11 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, శనిగరం ప్రాజెక్టు 1.09 టీఎంసీలకు గాను 0.46 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అందుబాటులో ఉన్న నీటిని కేవలం త్రాగునీరు అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్రప్రభుత్వం సూచించిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితిలో ఏర్పడి జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులలో కొత్తగా నీరు చేరలేదని అన్నారు. మళ్లీ వర్షాకాలం వరకు వర్షాలు పడే సూచనలు లేదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఇప్పుడు ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీరు తాగునీరు అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆదేశాల మేరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు అట్టి పెట్టడం జరిగిందని అన్నారు. కావున జిల్లాలో సాగునీరు లేదు కాబట్టి రైతులు వరి పంట పండించరాదని అన్నారు. గత సంవత్సరం 4.82 లక్షల ఎకరాలలో పంట వేయగా వాటిలో 3.68 లక్షల ఎకరాలలో కేవలం వరి పంట పండించడం జరిగిందని అన్నారు. 5 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యానికి ప్రభుత్వం 1200 కోట్లు పైన చెల్లించడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల గురించి రైతులకు వివిధ రకాలుగా అవగాహన కలిగించడం మూలంగా ఈ సంవత్సరం ఇప్పటికీ 70,000 ఎకరాల్లో పంట మార్పిడి జరిగి కందులు, పెసర్లు, మినుములు, చిరుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను వేశారని తెలిపారు. ఆగస్టు 15 తర్వాత ఆముదము, పత్తి , నూనె గింజల పంటలను పండించవచ్చని ఆరుతడి పంటలను పండించాలని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షాలు కురిస్తే సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయడానికి నీటిపారుదల శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ఎంఎల్సి యాదవ రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులలో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రాజెక్టుల ద్వారా నీటిని వదిలితే గూడవల్లి, హల్దివాగులో చెక్ డ్యామ్ లను నింపితే రైతులు వ్యవసాయం చేసుకునే పరిస్థితిలో ఉన్నాయని ఆమేరకు ఆలోచించాలని సూచించారు.

ఈ సందర్భంగా సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు పంపించిన లేఖను జిల్లా కలెక్టర్ చదివి వినిపించారు. ఈ లేఖలో గోదావరి నది నుండి నీరు వృధా పోకుండా లిఫ్ట్ చేసి ప్రాజెక్టులను నింపి రైతులకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని అదే విధంగా భూగర్భ జలాలను పెంచేలా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సర్కిల్ సీఈ సత్యనారాయణ రెడ్డి, సిద్దిపేట్, గజ్వేల్, కరీంనగర్ సర్కిల్ ల ఎస్ఈలు సూర్యకిరణ్, లక్ష్మణ్ పల్లంరాజు,డిస్ట్రిక్ ఇరిగేషన్ ఆఫీసర్ నాగరాజు, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.